తీన్మార్
తెలుగు దినపత్రిక

# అందరికీ ఆరోగ్య హక్కు

75 సంవత్సరాల స్వాతంత్ర్య భారత్‌లో రాజ్యాంగ లక్ష్యమైన అందరికీ విద్య, ఆరోగ్యం ఒక నినాదంగానే మిగిలింది. వైద్యం, ఆరోగ్య రంగంలో సాధించిన ప్రగతి ఫలాలు పేద వర్గాలకు చేరువ కాకపోవడంవల్ల ఆధునిక వైద్యసేవలు అందని ద్రాక్షలయ్యాయి. ఉచిత వైద్య ఆరోగ్య సేవలు పేదవర్గాలకు ఆశించిన మేరకు అందుబాటులో లేవు. అందరికీ ఆరోగ్యం దిశగా అడుగులు వేయడానికి ప్రపంచ దేశాలన్నీ ప్రాథమిక ఆరోగ్యపై దృష్టి సారించాలి. ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ అంటే ప్రజలందరికీ (కుల, మత, ప్రాంత, వర్గభేదాలు లేకుండా) సమానమైన, నాణ్యమైన కనీస ఆరోగ్య సేవలు ఇంటికి దగ్గరగా, అది తక్కువ ధరలో అందుబాటులోకి రావాలి. ప్రాథమికంగా అందించే వైద్యసేవలు సాంస్కృతికంగా ప్రజలకు ఆమోదయోగ్యమై వుండాలి. ప్రజలు అనారోగ్యానికి కారణం అవుతున్న వివిధ రంగాలను సమన్వయపరిచి ఒకే వేదికపైకి తీసుకు రావాలని ఉద్దేశంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రపంచ దేశాలన్నీ అందరికీ ఆరోగ్యాన్ని అందించాలనే లక్ష్యం చేరుకోవడానికి ప్రపంచ దేశాల ప్రభుత్వాల సమన్వయంతో ఏప్రిల్ 7 వ తేదీన ప్రపంచ ఆరోగ్యదినోత్సవాన్ని సభ్యదేశాలలో నిర్వహిస్తుంది. ఆరోగ్యం అంటే ఏ రోగం లేకుండా వుండటం మాత్రమే కాదు ఆరోగ్యం అంటే ఒక సంపూర్ణమైన, ఆరోగ్యకరమైన శారీరక, మానసికస్థితి. సామాజిక సాంస్కృతికంగా ఉత్తమ మనుషులుగా వుండి సాటివారి ప్రాణాలకు ఉపయోగపడటం. శారీరక వ్యాయామం, యోగ జీవనశైలిలో భాగం కావాలి. ఆరోగ్యకరమైన జీవనశైలి పాటించక పోవడం వల్ల రోగాలు మన జీవితాలను శాసిస్తున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ 1948లో ప్రజల ఆరోగ్యాన్ని పెంపొందించడానికి, ప్రపంచ ప్రజలను వ్యాధుల బారి నుండి సురక్షితంగా ఉంచడానికి, బలహీనవర్గాల ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడానికి, ప్రపంచంలో ఎవరు, ఏ మూల వున్నా కూడా వారికి అత్యున్నత ఆరోగ్యం అందించాలని ఐక్యరాజ్యసమితి పని చేస్తుంది. కరోనా వంటి అత్యవసర ఆరోగ్య పరిస్థితుల్లో అన్ని దేశాలకు దిశానిర్దేశం చేసి ఆరోగ్య సేవలను సమన్వయ పరిచింది. ప్రస్తుతం ప్రపంచంలోని 194 దేశాలలో ఈ సంస్థ పని చేస్తుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ 75 వ వార్షికోత్సవం జరుపుకొంటున్నది. డబ్లుటిఒ అందరికీ ఆరోగ్యం అనే నినాదాన్ని ఎంచుకున్నది. ప్రపంచ వ్యాప్తంగా ఆరోగ్యంపై అవగాహన పెంచడానికి కృషి చేస్తున్నది. భారత దేశంలో ప్రజారోగ్యం దక్షిణ రాష్ట్రాలు కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్రలో ఆరోగ్య సూచీలు ఉత్తరాది రాష్ట్రాల కంటే మెరుగ్గా వున్నాయి. ఇక్కడ ప్రజల్లో చైతన్యం, విద్యావిధానం అందుబాటులో వున్నవనరులు కారణమని చెప్పవచ్చు. ప్రభుత్వం విడుదల చేసిన ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్‌వి లెక్కల ప్రకారం మన రాష్ట్రంలో 69% మంది గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. ఆరోగ్యానికి ముఖ్యమైన మంచి నీటి సరఫరా సదుపాయం కేవలం 22% మందికి మాత్రమే అందుబాటులో వుంది. ఇంకా సురక్షితం కానీ పోయి మీద (కట్టెలు, బొగ్గు, పిడకలు) ఉపయోగించి వంట చేసుకునే ఇండ్లు 16% వున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో 22% ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో మలమూత్ర విసర్జన చేస్తున్నారు. మహిళల ఆరోగ్య విషయంలో 30% మంది మహిళలకు 18 సం? నిండకుండానే పెళ్లిళ్ళు అవుతున్నాయి. ఈ వయసులో ప్రత్యుత్పత్తి అవయవాలు పూర్తిగా అభివృద్ధి చెందకుండా గర్భం దాల్చుతున్నారు. దీని వలన నవజాత శిశువుల మరణాల సంఖ్య పెరుగుతున్నది. మహిళల్లో 15% మంది పోషకాహార లోపంతో, 36% మంది అధిక బరువుతో బాధపడుతున్నారు. రెండు సంవత్సరాలలోపు వయసు వున్న పిల్లలకు 25% టీకాలు అందడం లేదు. ఐదు సంవత్సరాల లోపు వున్న పిల్లల్లో 30% మంది పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. పురుషుల్లో ప్రతి ఐదుగురిలో ఒకరికి, మహిళల్లో ప్రతి పది మందిలో ఒకరికి అధిక రక్తపోటు వుంది. ప్రతి పది మందిలో ఒకరికి మధుమేహం వుంది. ప్రతి ఐదుగురు పురుషుల్లో పొగతాగడం, పొగాకు తినే అలవాటు వుంది. ప్రతి ముగ్గురిలో ఒకరికి మందు తాగే అలవాటు వుందని సర్వేలు చెబుతున్నాయి. పెట్టుబడిదారీ విధానంలో ప్రజారోగ్యం కార్పొరేట్ సంస్థలకు లాభం చేకూర్చే మార్కెట్ సరుకుగా మారింది. కరోనా కాలంలో జనాల ప్రాణాలను కాపాడడానికి ఆక్సిజన్ కోసం పడ్డ ఇబ్బందులు చూసి రాజస్థాన్ ప్రభుత్వం తెచ్చిన ఆరోగ్య హక్కు హర్షణీయం. మనిషికి సంపూర్ణ ఆరోగ్యం వుండాలంటే ఆరోగ్యవంతమైన జీవితం గడపాలి. చుట్టూ వుండే గాలి, నీరు, కాలుష్యం ఉత్పత్తి చేసే ఫ్యాక్టరీలు, ఇండస్ట్రీలు ఉన్నంత కాలం, ప్రజలను ఉద్యోగం పేరుతో, పోటీ పేరుతో ఆందోళనకు గురి చేసే కార్పొరేట్ సంస్థ ఉన్నంత కాలం, అసలు కనీస ఆహారం, నివాసం, పని, ఆరోగ్య సేవలు కల్పించ లేని ప్రభుత్వాలు వున్నంత కాలం సంపూర శారీరక, మానసిక, సామాజిక ఆరోగ్యం సాధ్యపడదు.

అందుకే ఆరోగ్యమనేది నినాదంగా వుండి పోకుండా అది నిజం కావాలంటే ప్రభుత్వం సామ్యవాద సమాజం వైపు అడుగులు వేయాలి. ప్రతి ఒక్కరూ ఏ రకమైన ఆర్థిక ఇబ్బందులు లేకుండా, ఆరోగ్య సేవలు ఎక్కడ కావాలంటే అక్కడ, ఎప్పుడు కావాలంటే అప్పుడు పొందే అవకాశం వుండాలి. ప్రపంచంలో 30% ప్రజలకు అత్యవసర సేవలు అందుబాటులో లేవు. ప్రతి సంవత్సరం ఆరోగ్యంపై చేసే ఖర్చులతో 20 లక్షల మంది దారిద్ర్య రేఖ దిగువకు జారిపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రాజస్థాన్ ప్రభుత్వం దేశంలో మొట్టమొదటి సారిగా ఆరోగ్య హక్కు చట్టం తేవడం హర్షణీయం. మనిషికి ఈ చట్టం కింద వ్యక్తి వుండే రకరకాల ఆరోగ్య హక్కులను పేర్కొన్నారు. వ్యాధి నిర్ధారణ ఆసుపత్రి వర్గాల నుండి తెలుసుకునే హక్కు, అత్యవసర సేవలు పొందడానికి అందుబాటులో వున్న ప్రైవేటు ఆసుపత్రిలో ముందస్తు డబ్బులు చెల్లించకుండానే వినియోగించుకునే హక్కు, అధిక ప్రమాణాలతో చికిత్స, ఉచిత రవాణా హక్కు, పేషెంట్ మరణించినప్పుడు ఆస్పత్రి ఖర్చులు చెల్లించారా లేదా అనే దాంతో సంబంధం లేకుండా మృతదేహాన్ని కుటుంబ సభ్యులు తీసుకు వెళ్లే హక్కు మొదలైనవి ఇందులో కల్పించారు. ఈ హక్కులకు సంబంధించిన మొత్తం వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుంది. కార్పొరేట్ ఆసుపత్రి నిర్వాహకులు ఈ చట్టం పట్ల నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ చట్టం అమలు అయితే అందరికీ ఆరోగ్యం అనేది నినాదం కాకుండా ఒక విధానంగా కొనసాగుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా ప్రజారోగ్యం మీద బడ్జెట్ ఎక్కువ కేటాయించి మానవ వనరుల సంరక్షణకు సమగ్రమైన ప్రజారోగ్య అభివృద్ధి వ్యూహాలను రూపొందించి అమలు చేయాలి.

# రక్తదానం ప్రాణదానం తో సమానం

**– పుట్టినరోజు సందర్భంగా రక్తదానం చేసిన యువకులను అభినందించిన ఎమ్మెల్యే**





పెబ్బేరు, జనవరి 08(తీన్మార్ న్యూస్): వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి జన్మదిన సందర్భంగా వనపర్తి నియోజకవర్గ పరిధిలోని ఖిల్లా ఘనపురం, పెద్దమందడి, పెబ్బేరు వనపర్తి పట్టణంలో ఏర్పాటు చేసిన మేఘా రక్తదాన శిబిరాల్లో యువకులు పెద్ద ఎత్తున రక్తదానం చేశారు. మొదటగా ఖిల్లా ఘనపురం ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే అనంతరం పెద్దమందడి మండలం వెల్టూరు గ్రామంలోని ప్రభుత్వాసుపత్రిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని సందర్శించి యువకులకు దృపత్రాన్ని పంపిణీ చేశారు. అక్కడి నుంచి పెబ్బేరు మండల కేంద్రంలో చేరుకున్న ఆయన పెబ్బేరు మండల కేంద్రంలోని ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని సందర్శించి రక్త దానం చేసిన యువకులను అభినందించి దృపత్రాన్ని అందించారు. అనంతరం వనపర్తి పట్టణంలోని నంది హిల్స్ లో గల తన నివాసం వద్ద ఏర్పాటు చేసిన మేఘా రక్తదాన శిబిరాన్ని సందర్శించిన ఆయన రక్తదానం చేసిన యువకులతో కలిసి మాట్లాడారు. రక్తదానం చేయడం ఆరోగ్యానికి మంచిదని ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయడంవల్ల మనిషికి రక్త శుద్ధి జరుగుతోందని, రక్తదానం చేయడంవల్ల ఎటువంటి ఇబ్బంది లేదని ఆయన పేర్కొన్నారు. రక్తదానం చేయడం మరొకరి ప్రాణం కాపాడినట్లేనని తన పుట్టినరోజు సందర్భంగా రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ రక్తదాన శిబిరం కార్యక్రమంలో ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు, యువకులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పింగిలి కాలేజీలో నిర్వహిస్తున్న నేషనల్ సెమినార్

**– పాల్గొన్న పశ్చిమ శాసన సభ్యులు నాయిని**

వడ్డేపెల్లి, జనవరి 08(తీన్మార్ న్యూస్): తెలంగాణ స్టేట్ కౌన్సిల్ అఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో డిపార్టుమెంటు అఫ్ కామర్స్ & బిజినెస్ మేనేజ్మెంట్ పింగిలి కాలేజి ఏర్పాటు చేసిన రోల్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ ఇన్ ప్రమోటింగ్ ఉమెన్ ఎంటర్ప్రినియర్షిప్ ఇన్ ఇండియా రెండు రోజుల నేషనల్ సెమినార్ హన్మకొండ వడ్డేపల్లి హన్మకొండలోని పింగిళి కళాశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి అనేది ఆర్థిక, సామాజిక మరియు రాజకీయ కోణాలను కలిగి ఉంటుంది మరియు మొత్తం జనాభాలో 50 శాతం ఉన్న మహిళల అభివృద్ధి లేకుండా అసంపూర్ణంగా ఉంటుందన్నారు. కాబట్టి, ఆరోగ్యకరమైన దేశ నిర్మాణానికి ఆర్థిక కార్యకలాపాల్లో మహిళల సహకారం చాలా అవసరమన్నారు. వ్యాపార





యాజమాన్యం మరియు వ్యాపార సృష్టి యొక్క చర్య మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తుంది, వారి ఆర్థిక బలాన్ని అలాగే సమాజంలో స్థానాన్ని పెంచుతుంది. అందువల్ల అన్ని రకాల వ్యాపారాలలో 25% కంటే ఎక్కువగా ఉన్న ఆర్థిక వ్యవస్థలోని అన్ని విభాగాలలో మహిళా–వ్యాపారవేత్తలు గణనీయమైన ప్రభావాన్ని చూపుతున్నారు. గణాంకాల ప్రకారం, బాగా అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలో స్త్రీలకు వ్యాపారవేత్తగా అభివృద్ధి చెందడానికి స్వేచ్ఛ ఉంది. భారతదేశంలో, సమాజంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఏ దేశమైనా సర్వతో ముఖాభివృద్ధికి మహిళా అభివృద్ధి కీలకమైన దశ. భారతదేశంలో ఆధునిక 21వ శతాబ్దంలో, మహిళలు ముందుకు సాగడానికి మరియు దేశాభివృద్ధిలో సహకరించడానికి అనేక సౌకర్యాలు మరియు సహాయాన్ని అందించారు. భారతదేశంలోని మహిళా పారిశ్రామిక వేత్తలకు ఆర్థిక కొరత, మార్గదర్శకత్వం లేకపోవడం, అవగాహన ప్రేరణ లేకపోవడం వలన మహిళా అభివృద్ధికి ఆటంకం ఏర్పడుతుం దని అన్నారు. ఈ కార్యక్రమంలో పింగిలి కాలేజి అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల అభివృద్ధే కస్తూరి ఫౌండేషన్ లక్ష్యం

పాలకవీడు, జనవరి 08(తీన్మార్ న్యూస్): పాలకవీడు మండలంలోని జెడ్పిహెచ్ఎస్ పాలకవీడు, బొత్తలపాలెం జానపాడు, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల యందు విద్యనభ్యసిస్తున్న 100 మంది పదవ తరగతి విద్యార్థులకు కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ కస్తూరి శ్రీ చరణ్ సహకారంతో మాదిరి ప్రశ్నాపత్రాలను ఫౌండేషన్ సభ్యులు గుడిపాటి కోటయ్య అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు గుడిపాటి కోటయ్య, మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్నటువంటి విద్యార్థులు పరిస్థితులకు అనుగుణంగా దేనికైనా సర్దుకుపోయే మనస్తత్వం కలిగి ఉంటారని, భవిష్యత్తులో ఆ మనస్తత్వమే ఉత్తమ పౌరులుగా ఎదగడానికి సహకారం అందిస్తుందని, అట్లాంటి విద్యార్థుల యొక్క విద్యాభివృద్ధి కోసం కస్తూరి ఫౌండేషన్ నిరంతరం పనిచేస్తుందని, పేదవారు విద్యకు దూరం కాకూడదనే లక్ష్యంతోనే ఈ ఫౌండేషన్ స్థాపించడం జరిగిందని, ప్రతి ఒక్కరు విద్యతోనే చైతన్య వంతులు అవుతారని అలాంటి విద్యను అందించడం కోసం ఫౌండేషన్ ఎల్లవేళలా సహకారం అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్షులు రెడ్డిపల్లి శ్రీనివాస్, ఫౌండేషన్




సభ్యులు పిడమర్తి వీరబాబు, ఎలకపల్లి మహేష్, సమ్మిడి నవీన్, పాలకవీడు జెడ్పిహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు ఉపేందర్, కేజీబీవీ ఎస్ఓ సుజాత, ఉపాధ్యాయులు సుందరి వెంకటేశ్వర్లు, కృపానిది, కరుణాబాయ్, తెహరా బేగం, శిరీష, స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

# పోడు భూముల రైతులకు పట్టాలి ఇవ్వాలి




పాలకవీడు, జనవరి 08(తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పోడు భూము రైతులకు పట్టాలు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర కౌలు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కొప్పోజు సూర్యనారాయణ అన్నారు. సోమవారం నాడు ఆయన పాలకవీడు మండలం లో జరిగిన పోడు భూముల రైతుల సమావేశంలో మాట్లాడుతూ గత ప్రభుత్వం అధికారంలో ఉన్న పది సంవత్సరాలు కూడా పోడు భూముల రైతులను మోసం చేసినదని, ఎన్నికలు వచ్చిన ప్రతిసారి పోడు భూముల రైతులకు పట్టాస్తామని వాగ్దానాలు చేసింది తప్ప అమలు చేయలేదని, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పోడు భూముల రైతుల సమస్యలను పరిష్కరించాలని దశాబ్దాల కాలంగా పోడు కొట్టుకొని జీవిస్తున్న రైతులకు పట్టాలిచ్చి వారందరికీ రైతుబంధు రైతు బీమా పథకాన్ని వర్తింపజేయాలని ఆయన కోరారు.

తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్ మాట్లాడుతూ

సూర్యాపేట జిల్లాలో ఉన్న దేవాలయ భూముల రైతులకు కూడ రైతు బంధు పథకాన్ని వర్తింపజేయాలని అలాగే కౌలు రైతులు కూడా రైతుబంధు పథకాన్ని వర్తింపజేయాలని అనేకమంది రైతులు పట్టణ ప్రాంతాలకు వలస వెళ్లారని అసలైన వాస్తవ సాగుదారులు గ్రామాలలో భూములను నమ్ముకొని జీవిస్తున్నారని వారికి ప్రభుత్వం నుంచి ఎలాంటి సంక్షేమ పథకాలు అందడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశం లో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు, పోడు భూముల రైతులు వీరాచారి ముళ్ళ జానయ్య, దాసరి శ్రీను, చప్పిడి రజినికాంత్, తదితరులు పాల్గొన్నారు.

# కంప్యూటరీకరణ ప్రజా పాలన దరఖాస్తులు



**– పరిశీలిస్తున్న తహశీల్దార్ దామోదర్ యాదవ్**

రాజాపేట, జనవరి 08(తీన్మార్ న్యూస్): ఈనెల 6 వరకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన దరఖాస్తులను అధికారులు యుద్ధ ప్రాతిపదికన కంప్యూటరీకరణ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక సిబ్బందితో మండల వ్యాప్తంగా ప్రజా పాలనలో వచ్చిన 13 వేల 536 దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలిస్తూ కంప్యూటరీకరణ నిర్వహిస్తున్నారు. దరఖాస్తులను కంప్యూటర్లో పొందుపరుస్తున్న విధానాన్ని తహశీల్దార్ దామోదర్ తన సిబ్బందితో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు ఎంపీఓ వదినకర్ పాల్గొన్నారు.

# దర్గా పీఠాధిపతి ఖుస్రూ పాషాతో నాయిని రాజేందర్ రెడ్డి పూజలు



కాజీపేట, జనవరి 08 (తీన్మార్ న్యూస్): కాజీపేట దర్గా పీఠాధిపతి ఖుస్రూ పాషాతో కలిసి సోమవారం వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి సయ్యద్ షా అఫ్జల్ బియాబానీ దర్గాలో పూజలు నిర్వహించారు. అనంతరం దర్గా పీఠాధిపతి ఖుస్రూ పాషా ఇంటిలో మైనారిటీ నాయకులతో సమావేశమైనారు. ఈ కార్యక్రమంలో కార్పొ రేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, సయ్యద్ రజాలి, మాజీ కార్పొరేటర్ మహమ్మద్ అబుబాకర్, జిల్లా మైనారిటీ చైర్మన్ మిర్జా అజీజుల్లా బేగ్, మొహమ్మద్ సమి స్థానిక డివిజన్ అద్యక్షుడు సింగారపు రవి ప్రసాద్, స్థానక సీనియర్ నాయకులూ ఎస్.కే.అమర్, మట్టేడ కరుణాకర్, ఇమ్రాన్, మహమ్మద్ రఫీక్, నాయిని లక్ష్మా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వార్డ్ ను పరిశుభ్రంగా ఉంచుకుందం





**– కౌన్సిలర్ పంగరెక్కా స్వామి**

భువనగిరి టౌన్, జనవరి 08(తీన్మార్ న్యూస్): పట్టణంలో 8 వ వార్డ్ లో స్థానిక బ్రహ్మంగారి దేవాలయం నుండి గల పెద్ద మోరి లో గత కొన్ని రోజులుగా పేరుకు పోయిన చెత్తను ఈ రోజు కమిషనర్ నాగిరెడ్డి సహకారం తో కౌన్సిలర్ పంగారేక్క స్వామి అధ్వర్యంలో జేసిబి పెట్టించి పరిశుభ్రంగా చేయించారు. వార్డ్ లో ఉన్న ప్రతి మోరి కాలువ ను జవాన్ నర్సింగ్ రావు పురపాలక సిబ్బంది తో కలిసి పరిశీలించి ఎక్కడ కుడ చెత్త జమ కాకుండా చూడాలని వార్డ్ ను పరిశుభ్రంగా ఉంచుకుందాం అని వార్డ్ ప్రజలు కూడా సహకరించాలని కోరారు.

# మృతుడు కుటుంబానికి ఎమ్మెల్యే మేఘరెడ్డి ఆర్థిక సహాయం



పెబ్బేరు, జనవరి 08(తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా, పెబ్బేరు మండలం, బునియాదిపురం గ్రామనికి చెందిన తాండూర్ వసంత గౌడ్ గత కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం రాత్రి మరణించారు. ఇట్టి విషయాన్ని కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ సాగర్ మేఘరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా తన వంతుగా 5 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో పెబ్బేరు మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ సాగర్ 5000 రూపాయలు అందజేశారు. వెంకట స్వామి గౌడ్, మేకల రాముడు, లక్ష్మీనారాయణ, రాముడు, కురుమన్న, కాంగ్రెస్ యువ నాయకులు శ్యామ్, రామకృష్ణ, బుచ్చిబాబు ఈరపాగ రాముడు, వీరభద్రుడు, బాల్ రాం, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో నాయిని ప్రత్యేక పూజలు

**- క్యాంపు కార్యాలయానికి ప్రజా భవన్ గా నామకరణం**





హన్మకొండ, జనవరి 08(తీన్మార్ న్యూస్): హనుమకొండ బాలసముద్రం లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఈ రోజు తెల్లవారుజామున వరంగల్ పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంను "ప్రజా భవన్" గా పేరు మార్చి నామకరణం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సతీమణి నాయిని నీలిమా రెడ్డి, కూతురు నాయిని నాయిని గోదా రెడ్డి, అల్లుడు విష్ణువర్ధన్ రెడ్డి మరియు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఓపిఎస్ సాధన కోసం రిలే నిరాహార దీక్షలు

**- ఎస్సిఆర్ఎంయు**



నల్లగొండ జిల్లా ప్రతినిధి, జనవరి 08(తీన్మార్ న్యూస్): రైల్వే శాఖలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగ కార్మికులందరికీ పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ నడికుడి -నల్లగొండ బ్రాంచ్ ల ఆధ్వర్యంలో ఏఐఆర్ యఫ్ పిలుపుమేరకు నల్లగొండ రైల్వే ఆవరణలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలను సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి ప్రారంభించి మాట్లాడుతూ రైల్వే ఉద్యోగ కార్మికులకు పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని అందుకోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న అనేక చట్టాలను రద్దుచేసి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్ లను తీసుకొచ్చిందని ఆరోపించారు. ప్రైవేటీకరణ విధానాలను అవలంబిస్తూ అంబానీ, ఆదానిలా రైల్వేలను ప్రవేశపెట్టి ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు. బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ స్టేట్ సెక్రటరీ కృష్ణారెడ్డి కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పాశం నరేష్ రెడ్డి హ్యూమన్ రైట్స్ ప్రొటెక్ట్ సెల్ తెలంగాణ ఏపీ ప్రతినిధి సాంబశివరావు సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య లు పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల పట్ల అవలంబిస్తున్న నిరంకుశ విధానాలను మానుకోవాలని వెంటనే పాత పెన్షన్ పథకాన్ని ని పునరుద్ధరించాలని కోరారు.

కార్మికుల పోరాటాల కు మద్దతు తెలిపారు. ఈ నిరాహార దీక్షలో నల్లగొండ సూపర్వైజర్స్ సాంబశివరావు, సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ నల్గొండ బ్రాంచ్ చైర్మన్ ఎం రామభద్ర రావు, కార్యదర్శి కె వెంకటేష్, ట్రెజరర్ సిహెచ్ ఐలేని నడికుడి బ్రాంచ్ కార్యదర్శి వివిఎస్ సాయికుమార్, అసిస్టెంట్ సెక్రటరీ కే.ప్రసాద్, వైస్ చైర్మన్ అబ్రహం, కోశాధికారి ఎం శివప్రసాద్, ఆర్ స్వామిరావు, కె భిక్షపతి, వివిధ విభాగాలను ఉద్యోగులు కార్మికులు పాల్గొన్నారు.

# స్టడీ మెటీరియల్స్ ను పంపిణి చేసిన మర్రి నీత్య నిరంజన్ రెడ్డి




ఇబ్రహీంపట్నం, జనవరి 08 (తీన్మార్ న్యూస్): ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా స్టడీ మెటీరియల్ పంపిణీ ని ప్రారంభించిన ఎం ఎస్ ఆర్ యువసేన ఫౌండేషన్ చైర్మన్,తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యులు, ఇబ్రహీంపట్నం నియోజకవర్గ నాయకులు,మంచాల జడ్పిటిసి మర్రి నిత్య నిరంజన్ రెడ్డి ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు తన సొంత ఖర్చులతో ఉచితంగా స్టడీ మెటీరియల్ ను సోమవారం రోజు ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మంచాల మండల పరిధిలోని జాపాల్, ఆరుట్ల, మంచాల, తాళ్లపల్లి గూడా, నోముల గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు కస్తూర్బా, బాలుర బాలికల పాఠశాలలో నోముల లోని బీసీ హాస్టల్ చదువుకుంటున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా మర్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి 10/10 సాధించి తల్లిదండ్రులకు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. కష్టపడి చదివి ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు అండగా ఉంటామని తెలిపారు. అనంతరం జాపాల గ్రామ పాఠశాల ఆవరణలో మర్రి నిత్య నిరంజన్ రెడ్డి దంపతులు మొక్కలను నాటారు. పాఠశాల ఉపాధ్యాయులు బృందం మర్రి దంపతులను సన్మానించారు. జాపాల గ్రామంలో ఉపసర్పంచ్ మళ్ళప్ప మర్రి నిత్య నిరంజన్ రెడ్డిలను పుష్పగుచ్ఛం అందజేసి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. ఈ యొక్క కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల ప్రానోపాధ్యాయులు,ప్రజా ప్రతినిధులు మంచాల సర్పంచ్ జగన్ రెడ్డి, జాపాల ఎంపీటీసీ లట్టుపల్లి చంద్రశేఖర్ రెడ్డి, ఉపసర్పంచ్ మల్లప్ప, వివిధ గ్రామాల స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు కమలాకర్ రెడ్డి, ఆవుల మల్లేష్, లింగం గౌడ్, మహేష్ గౌడ్, జగన్, తిరుమల రెడ్డి, జంగయ్య, వెంకటేశ్, కొమురయ్య, బాలరాజు, మాదగొని జంగయ్య గౌడ్, రావుల బాషా, బగ్గరములు, ఎం ఎన్ ఆర్ యువసేన టీం సభ్యులు మధుకర్ రెడ్డి,ప్రదీప్ రెడ్డి, తిరుమల రెడ్డి, బూర శివ, ధనరాజ్, శ్రవణ్ రెడ్డి, నాని, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు సమిష్టిగా

## కృషి చేయాలని కలెక్టర్ కు వినతి



భువనగిరి జిల్లా ప్రతినిధి, జనవరి 08(తీన్మార్ న్యూస్): జిల్లాలో ప్రభుత్వ యంత్రాంగం తో పాటు స్వచ్ఛంద సంస్థల, బాలల హక్కుల సంఘాల, మరియు చైల్డ్ రైట్స్ ఆక్టివిస్ట్ ల సమిష్టి కృషితో, రాష్ట్రంలో యాదాద్రి భువనగిరి జిల్లాను "బాలకార్మిక రహిత జిల్లా"గా, "చైల్డ్ ఫ్రెండ్ డిస్ట్రిక్ట్" గా ఏర్పాటు చేయాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక, ఆల్ ఇండియా పేరెంట్స్ అసోసియేషన్ ఆద్వర్యంలో సోమవారం కలెక్టరేట్ లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ( జిల్లా రెవెన్యూ అధికారి)కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సి ఆర్ పి ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆవుల వినోద్ కుమార్, ఐపా జిల్లా అధ్యక్షులు కొడారి వెంకటేష్ లు మాట్లాడుతూ కొందరు అధికారులు బాలల సంక్షేమానికి, అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేయడం లేదని వారు ఆరోపించారు. ప్రతి సంవత్సరం జనవరి 1 నుండి 31 వరకు జరిగే "ఆపరేషన్ స్మైల్", జూన్ 1 నుండి 31 వరకు జరిగే "ఆపరేషన్ ముస్కాన్" ల సమావేశంలలో అందరి భాగస్వామ్యం ఉండడం లేదని వారు ఆరోపించారు. కొందరు అధికారులు, తమకు అనుకూలంగా ఉన్న వారికి, పిల్లల హక్కుల, అభివృద్ధికి, సంబంధం లేని వారికి ఆహ్వానాలు పంపి, సమావేశాల్లో భాగస్వామ్యం చేస్తున్నారని వారు అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా అనేక మంది బాలలు బడి మానేసి పట్టణాల్లో భిక్షాటన చేస్తూ, గ్రామీణ ప్రాంతాల్లో ఇటుక బట్టీల్లో, కర్మాగారాల్లో కార్మికులుగా పని చేస్తున్నారని వారు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని, అందరి భాగస్వామ్యంతో బాలల అభివృద్ధికి, బాలల హక్కుల పరిరక్షణ కోసం కృషి చేయాలని వారు కోరారు.

# అంగన్వాడి పాఠశాలను పరిశీలించిన

## జడ్పిటిసి మర్రి నిత్య నిరంజన్ రెడ్డి

**- అంగన్వాడి పాఠశాలకు నా వంతు కృషి చేస్తాను**

**- కాంగ్రెస్ పార్టీ పిసిసి సభ్యుడు మర్రి నిరంజన్ రెడ్డి**



మంచాల, జనవరి 08(తీన్మార్ న్యూస్): మంచాల మండలం, ఆరుట్ల గ్రామంలోని హై స్కూల్ ఆవరణలో ఉన్న అంగన్వాడి పాఠశాలను జడ్పిటిసి మర్రి నిత్య నిరంజన్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ పిసిసి సభ్యుడు మర్రి నిరంజన్ రెడ్డి కలిసి అంగన్వాడి పాఠశాలలో ఉన్న సమస్యల గురించి అంగన్వాడి టీచర్లను అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీలో విద్యుత్ సరఫరా లేక సీలింగ్ ఫ్యాన్లు లేక సరైన కుర్చీలు లేక విద్యార్థులు ఆడుకోవడానికి సరైన ఆట వస్తువులు లేవు అని అంగన్వాడి టీచర్లు మంచాల మండలం జడ్పిటిసి నిత్య నిరంజన్ రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమస్యలు తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ పిసిసి సభ్యుడు మర్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ అంగన్వాడి పాఠశాలలకు కావలసిన ఆట వస్తువులు, కుర్చీలు, సీలింగ్ ఫ్యాన్లు ఇంకా అంగన్వాడి పాఠశాలకు అవసరమైన ఎలాంటి వస్తువులైన నా వంతుగా సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నాను అని మర్రి నిరంజన్ రెడ్డి అంగన్వాడి టీచర్లకు అభయం ఇచ్చారు. ఈ యొక్క కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కిషన్ సెల్ మండల అధ్యక్షుడు కావలి బుగ్గ రాములు ముదిరాజ్, కోరుట్ల కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు రావుల భాష, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు మాధగోని జంగయ్య గౌడ్, చెరుకు నరసింహ గౌడ్, మెగావత్ లక్ష్మనాయక్, తదితరులు పాల్గొన్నారు.

# రాజాపేట లో చెక్కులు పంపిణీ చేసిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య





రాజాపేట, జనవరి 08(తీన్మార్ న్యూస్): రాజపేట తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం కల్యాణ లక్ష్మి చెక్కులను ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం లబ్ధిదారుల నిర్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అధికారులు తహసీల్దార్ దామోదర్ యాదవ్, ఆర్ఐ లు ఎండి.సలీం, రమేష్, ప్రజాప్రతినిధులు ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ మోత్కుపల్లి జ్యోతి ప్రవీణ్, ఎంపీపీ గోపగాని బాలమణి యాదగిరి గౌడ్, జెడ్పీటీసీ చామకూర గోపాల్ గౌడ్, సర్పంచ్ ఆడేపు ఈశ్వరమ్మ శ్రీశైలం, ఎంపీటీసీ దాచేపల్లి రాజు, గుంటి మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ గౌడ్, మండల మహిళా అధ్యక్షురాలు నాగారం రేణుక, మేడిశెట్టి సురేష్, రాజాపేట పట్టణ టౌన్ ప్రెసిడెంట్ ఐరేని నవీన్, కుమార్, నాగిర్తి రాజిరెడ్డి, రాపోలు లక్ష్మారెడ్డి, రాంజీ నాయక్, అంకతి బాలయ్య, ఎంపీటీసీ ఎర్రోళ్ల స్వరూపబాబు, యువజన నాయకులు ఇంజ నరేష్, నెమలి కేదారి, అఖిలపక్ష నాయకులు ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ మహిళ యూత్ కాంగ్రెస్ ఎన్ ఎస్ యు ఐ గ్రామ శాఖ అధ్యక్షులు లబ్ధిదారు తదితరులు పాల్గొన్నారు.

# ఇరుముడి తో శబరిమల యాత్ర



తుర్కపల్లి, జనవరి 08(తీన్మార్ న్యూస్): ఇరుముడి కట్టుకొని శబరిమల యాత్రకు తుర్కపల్లి అయ్యప్ప స్వాములు తుర్కపల్లి అయ్యప్ప కొండ సన్నిధానం నుండి శబరి యాత్రకు అయ్యప్ప స్వాములు స్వామియే శరణం అంటూ శబరి యాత్రకు బయలుదేరారు. తిప్పారం నగేష్ గురుస్వామి ఆధ్వర్యంలో పెండెం శ్రీనివాస్ గురు స్వామి కరకమలముల చేత ఇరుముడి పూజా మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అక్కడి నుండి తుర్కపల్లి రామాలయం మరియు దుర్గమ్మ గుడి వద్దకు పాదయాత్రగా వెళ్లి అయ్యప్ప నామస్మరణతో ప్రాంతమంతా అయ్యప్ప నామస్మరణతో మారుమోగింది. ఈ కార్యక్రమంలో గురు స్వాములు తిప్పారం బ్రహ్మచారి, బోయిన కుమార్, జూపల్లి గణేష్, కట్కూరి రాజు గౌడ్, అనుజు సిద్దయ్య చారి, అన్నోజి కిరణ్ చారి, కూరెళ్ళ సందీప్ చారి, వంగాల ఉదయ్ కిరణ్ గౌడ్, కూరెళ్ల శ్రీనివాస్, గంగరబోయిన కార్తీక్, కూరెళ్ళ వినోద్, లింగాల నరసింహ, కట్కూరి మనితేజ్, కూరెళ్ళ తేజేశ్వర్, కసరబోయిన బాలకృష్ణ, కూరల్లో ఉపేంద్ర చారి, కళాసికం జగదీష్, మరియు గ్రామ పెద్దలు ప్రజలు భక్తులు అందరు పాల్గొన్నారు.

# పల్లా రాజేశ్వరెడ్డి నోరు అదుపులో పెట్టుకో

**- తీన్మార్ మల్లన్నపై పల్లా వాఖ్యలను ఖండించిన అచ్చునూరి కిషన్**



ములుగు, జనవరి 08 (తీన్మార్ న్యూస్): తీన్మార్ మల్లన్న టీమ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు, ములుగు జిల్లా ఇంఛార్జీ కిషన్ సోమవారం జిల్లా కార్యాలయంలో మాట్లాడుతూ గత బిఆర్ఎస్ పాలనలో ఎలక్ట్రిక్ సీటి బోర్డులో అక్రమంగా 27 మంది ఉద్యోగాలు పొంది ప్రజలు కట్టే పన్నులతో జీతాలు తీసుకుంటూ విలాసవంతమైన జీవితాన్ని గడిపారు అని, గత పాలకుల అరాచకాలను, తప్పిదాలను మార్నింగ్ న్యూస్లో రోజు వారిగా ప్రజలకు తెలియపరుస్తున్న తీన్మార్ మల్లన్న పై జనగాం బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మీడియా సమావేశంలో అహంకారతో వాడు అంటూ మాట్లాడుతూ తీన్మార్ మల్లన్నపై డిఫర్మేషన్ కేసు పెడతానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గత ప్రభుత్వంలో తీన్మార్ మల్లన్నపై అనేక రకాలైన కేసులు, దాడులు, 103 రోజులు జైల్లో నిర్బంధించడం, టీమ్ సభ్యులను బెదిరించడం, దాడులు చేయడం, పాలనను ప్రక్కకు పెట్టి నియంత పాలనకు ఆజ్యం పోసిన బిఆర్ఎస్ పార్టీ ప్రశ్నించే గొంతుకలను అణగదొక్కాలని అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఎన్ని కుట్రలు చేసినా కూడా మీ జేజమ్మ కే భయపడకుండా ఇంకా రెట్టించిన ఉత్సాహంతో నిరంతరం మీ అరాచక, కుటుంబ పాలనను నిత్యం ప్రజలకు వివరిస్తూ ప్రజలను చైతన్యవంతులను చేసిన ప్రజా గొంతుక తీన్మార్ మల్లన్నయే అని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు అని చెప్పకనే చెప్పవచ్చున్నారు కిషన్. కానీ పల్లా రాజేశ్వర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకుల మాటలు వింటే ఓటమిని జీర్ణించుకోలేక పోతున్నారు అని స్పష్టమవుతోంది. బిఆర్ఎస్ పార్టీ ఓటమికి కారణం యూట్యూబ్ చానెల్స్ యే అని ఈ మధ్య కాలంలో కేటీఆర్ మాటలను బట్టి అర్థమవుతోందన్నారు. ఇప్పటికైనా పల్లా రాజేశ్వర్ రెడ్డి నోరు అదుపులో పెట్టుకోని మాట్లాడాలని తీన్మార్ మల్లన్న టీమ్ రాష్ట్ర కమిటీ హెచ్చరిస్తుంది అని కిషన్ తెలియజేశారు.

# ఎం ఎన్ ఆర్ ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ

**- ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించిన మర్రి నిరంజన్ రెడ్డి**



ఇబ్రహీంపట్నం, జనవరి 08 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యులు మర్రి నిరంజన్ రెడ్డి, ఎమ్మెన్నార్ యువసేన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా తన సొంత నిధులతో ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుకుంటున్న విద్యార్థిని విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ చేసే కార్యక్రమానికి సోమవారం రోజు ఇబ్రహీంపట్నం నియోజకవర్గం శాసన సభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ యొక్క కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు జంగారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రామ్ రెడ్డి, అరవింద్ నాయక్, శ్రీనివాస్ రెడ్డి, కమలాకర్ రెడ్డి, ఉదయపాల్ రెడ్డి, శ్రీనివాస్ నాయక్, తిరుమల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి అండర్-17 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సాఫ్ట్

## బాల్ పోటీలకు ఎంపికైన బొందుగుల విద్యార్థి



రాజాపేట, జనవరి 08(తీన్మార్ న్యూస్): గత నెల 22న నిర్మల్ జిల్లా ఎన్టిఆర్ మిని స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో 10వ తరగతి చదువుతున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బొందుగుల విద్యార్థి బాల్ద జశ్వంత్ ఉమ్మడి నల్గొండ జిల్లా జట్టు తరుపున ఆడి మంచి ప్రతిభ కనబరిచి తెలంగాణ రాష్ట్రం తరపున జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

ఈ నెల 10-01-2024 నుండి 15-01-2024 తేదీ వరకు రాజస్థాన్ రాష్ట్రంలోని బీకనీర్ లో జరిగే జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపిక కావడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు అష్రఫ్ జాని షేక్, వ్యాయమ ఉపాధ్యాయులు మధు, ఎస్ఎమ్సీ చైర్మన్ బాల్దా శ్రీశైలం, గ్రామ సర్పంచ్ కంచర్ల శ్రీనివాస్ రెడ్డి, ఎంపీపీ గోపగాని బాలామని, బాల్దా శ్రీకాంత్, మర్ల మల్లేశం, మాచి రెడ్డి సురేందర్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం అపర్ణ దేవి, కృపా ప్రచారిని, జహంగీర్, నాగమణి, పాండు, వేణుగోపాల్, రాజయ్య, మరియు గ్రామ పెద్దలు ప్రత్యేకంగా అభినందించారు.

# సిఎంఆర్ లక్ష్యాన్ని సాధించాలి

**- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**- ఉన్నత అధికారులతో సమీక్ష సమావేశం**

భువనగిరి జిల్లా ప్రతినిధి, జనవరి 08(తీన్మార్ న్యూస్): రోజు వారి పర్యవేక్షణతో సీఎంఆర్ లక్ష్యాన్ని సాధించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి జిల్లా కలెక్టర్లకు సూచించారు. సోమవారం నాడు ఆయన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులతో కలసి జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో కష్టమ్ మిల్లింగ్ రైస్ ప్రగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైస్ మిల్లులకు సీఎంఆర్ కింద కేటాయించిన ధాన్యాన్ని వేగవంతంగా మిల్లింగ్ జరిపించి, కోటా మేరకు భారత ఆహార సంస్థ (ఎఫ్సీఐ) కు బియ్యం






చేరవేసేలా పర్యవేక్షణ జరపాలన్నారు. గత డిసెంబర్ 31 నాటికే ఎఫ్.సి.ఐకి సీ.ఎం.ఆర్ కోటాను చేరవేయాల్సి ఉన్నప్పటికీ, అనేక జిల్లాలలో మిల్లింగ్ ప్రక్రియ పెద్ద ఎత్తున పెండింగ్లోనే ఉండిపోయిందని, ఎఫ్.సీ.ఐ గడువు పొడిగించినందున, నిర్ణీత సమయం లోగా కస్టమ్ మిల్లింగ్ రైస్ నిల్వలు చేరేలా చూడాలన్నారు. ఈ అంశానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ, రైస్ మిల్లుల వారీగా పర్యవేక్షణ జరపాలని, మిల్లర్లు పూర్తి స్థాయి సామర్ధ్యం మేరకు మిల్లింగ్ జరిపేలా కృషి చేయాలని, రైస్ మిల్లులను అధికారులు నిరంతరం సందర్శిస్తూ, పూర్తి స్థాయిలో మిల్లింగ్ జరిగేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలన్నారు. కేటాయించిన ధాన్యం నిల్వలను పరిశీలించాలని, ఎక్కడైనా పక్కదారి పట్టించినట్లు, అక్రమాలకు పాల్పడినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా పీడీఎస్ బియ్యం రీసైక్లింగ్ దందాను నిరోధించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేద కుటుంబాలకు అందించే రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా గట్టి నిఘా ఉంచాలని, పోలీసు అధికారులను సమన్వయము చేస్తూ, అక్రమార్కులను గుర్తించి వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి మాట్లాడుతూ అభయహస్తం కింద 5 గ్యారెంటీ పథకాలకు సంబంధించిన దరఖాస్తులను ఎలాంటి తప్పిదాలకు తావివ్వకుండా, రోజు వారీగా నమోదును పర్యవేక్షిస్తూ నిర్ణీత సమయంలోగా కంప్యూటరీకరణ పూర్తి చేయించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ హనుమంతు కే.జెండగే, జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ ఏ.భాస్కరరావు, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సునంద, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ గోపి కృష్ణ, జిల్లా సరఫరాల అధికారి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.



# మేడారం జాతర పనులను తనిఖీ చేసిన ఐటిడిఏ పిఓ అంకిత్ ఐఏఎస్



తాడ్వాయి, జనవరి 08 (తీన్మార్ న్యూస్): శ్రీ సమ్మక్క సారలమ్మ తాడ్వాయి మండలంలోని మేడారం, రెడ్డిగూడెం గ్రామాలలో సాగునీటి, గ్రామీణ నీటి సరఫరా (మిషన్ భగీరథ) పనులను సంబంధిత ఇంజనీర్లు మరియు ఐటీడీఏ అధికారులతో కలిసి ప్రాజెక్ట్ అధికారి ఐటిడిఏ ఏటూరునాగారం అంకిత్ ఐఏఎస్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సంబంధిత ఇంజనీర్లతో కలిసి జంపన్నవాగుపై ఇసుక రీ హ్యాండ్లింగ్, లెవలింగ్ మరియు ఇంఫిల్ట్రేషన్ బావుల డీసిల్టింగ్ను పరిశీలించారు మరియు ఇటీవల జరిగిన సమీక్ష సమావేశంలో పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా (మిషన్ భగీరథ) మరియు స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి ఆదేశాల మేరకు ఇరిగేషన్ ఇంజనీర్లు పనుల నాణ్యతను కొనసాగించాలని వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలన్ ఆదేశించారు. ఏటూరునాగారం గోదాం నుంచి మేడారం వరకు బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ మెటీరియల్ డంపింగ్ను పరిశీలించి, రేపటి నుంచి బ్యాటరీ ఆఫ్ ట్యాప్ల ఏర్పాటును సక్రమంగా ప్రారంభించాలని ఇరిగేషన్ ఇంజినీర్లను ఆదేశించారు. రెడ్డిగూడెం గ్రామంలో ప్రైవేట్ షెడ్లో గ్రామీణ నీటి సరఫరా (మిషన్ భగీరథ) మెటీరియల్ అంటే జిఐ షీట్లు, టాయిలెట్ మెటీరియల్, డోర్ ఫ్రేమ్లు, కుళాయిల బ్యాటరీ తదితర డంపింగ్ను పరిశీలించి, రేపటిలోగా మెటీరియల్ డంపింగ్ పూర్తి చేసి రేపటి తర్వాత రోజు పనిని నిలబెట్టడం ప్రారంభించాలని ఆర్డబ్ల్యుఎస్ ఇంజినీర్లను ఆదేశించారు. మ్యూజియం ప్రాంతంలోని బోర్ వెల్స్ ఫ్లషింగ్ మరియు పొదలు క్లియరెన్స్ పనులను పరిశీలించి, ఆవరణను చక్కగా మరియు పరిశుభ్రంగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ (జి) జె. వసంతరావు, స్టాటిస్టికల్ ఆఫీసర్ ఎం. రాజ్కుమార్, సూపరింటెండింగ్ ఇంజనీర్ ఆర్డబ్ల్యుఎస్ (ఎంబి) కె. శంకర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సుభాష్, నారాయణ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సతీష్, సదయ్య మరియు అసిస్టెంట్ ఇంజనీర్లు ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంట ఉన్నారు.



# కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి





భువనగిరి జిల్లా ప్రతినిధి, జనవరి 08(తీన్మార్ న్యూస్): కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకునేలా క్షేత్రస్థాయి నుండి ప్రజలకు అవగాహన కలిగించాలని కేంద్ర ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి శాఖ సంయుక్త కార్యదర్శి నవీన్ కుమార్ షా తెలిపారు. సోమవారం నాడు బీబీనగర్ గ్రామ పంచాయితీలో స్వయం సహాయక సంఘాల మహిళలు, ప్రజలు, వ్యాపారస్థులతో జరిగిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా అందరూ 2047 నాటికి అభివృద్ధి చెందిన స్వాలంబన భారతదేశంగా తీర్చిదిద్దడంలో కృషి చేస్తామని, ఐక్యతన బలోపేతం చేస్తామని, పౌర విధులు నిర్వర్తిస్తామని ప్రజలు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నవీన్ కుమార్ షా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, తమ జీవన ప్రమాణాలను పెంచుకోవాలని అన్నారు. ఆయుష్మాన్ భారత్, ఉజ్వల, ప్రధానమంత్రి) జన ధన్ యోజన, సురక్ష బీమా యోజన, జీవనజ్యోతి బీమా యోజన, ముద్ర యోజన, జాతీయ గ్రామీణ జీవనోపాధి పథకం, తదితర కేంద్ర ప్రభుత్వ పథకాలతో లబ్దిపొందిన లబ్దిదారులు తాము ఏవిధంగా పథకాలను సద్వినియోగం చేసుకున్నదీ, తమ ఆర్థిక అభివృద్ధికి దోహదపడిన విజయగాథలను వివరించారు. వారిని సభా కార్యక్రమంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సుధాకర్ గౌడ్, జడ్పిటిసి ప్రణీత పింగళరెడ్డి, లీడ్ బ్యాక్ మేనేజరు శ్రీరామకృష్ణ, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, ఎంపిడిఓ శ్రీవాణి, ఎపిజీవిబి మేనేజరు శంకర్ రెడ్డి, ఎంపిఓ స్వాతి, మెడికల్ ఆఫీర్ యాదగిరి, వివిధ శాఖల అధికారులు హాజరైనారు.



# కాళేశ్వరం, టీఎస్పీఎస్సీ కుంభకోణాలపై సీబీఐ విచారణ జరిపించాలి

**టీఎస్పీఎస్సీని ప్రక్షాళన చేసి జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి**

**17 పార్లమెంట్ స్థానాల్లో బీఎస్పీ పోటీ**

**డా.ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్**



నాగర్ కర్నూల్, జనవరి 08 (తీన్మార్ న్యూస్): కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి, అక్రమాలు టీఎస్పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీ కుంభకోణాలపై సీబీఐ విచారణ జరిపించాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నాగర్ కర్నూల్ లో ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్యకార్యకర్తల సమీక్షా సమావేశంలో పాల్గొని మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టడంలో వేల కోట్లకు టెండర్లు దక్కించుకొని, నాసిరకంగా పనులు చేసిన కన్స్ట్రక్షన్ కంపెనీలను బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్ చేశారు. మిషన్ భగీరథలో జరిగిన కుంభకోణంపై దర్యాప్తు జరపాలని అన్నారు. టీఎస్పీఎస్సీ పరీక్షా పేపర్లు లీక్ చేసిన అప్పటి ఛైర్మెన్, సభ్యులను కాపాడడం కోసమే గత ప్రభుత్వం సిట్ వేసిందని ఆరోపించిన ఆయన ఇప్పటి వరకూ సిట్ ఎవరినీ ప్రశించలేదన్నారు. టీఎస్పీఎస్సీని తక్షణమే ప్రక్షాళన చేసి జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగాల భర్తీ చేపట్టాలని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో డబ్బు, మద్యం పంపిణీ విపరీతంగా జరిగిందన్నారు. కేసీఆర్ దొర పాలన పోయి మరో దొర పాలన వచ్చిందే తప్ప, బహుజనుల ఎటువంటి న్యాయం జరుగలేదన్నారు. ధరణి పోర్టల్ రద్దు చేస్తామన్న గత హామీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిలబెట్టుకోవాలన్నారు. 30 వేల ఎకరాల పేదల అసైన్డ్ భూములను బలవంతంగా ప్రభుత్వం గుంజుకొని హైదరాబాద్ చుట్టుపక్కల రియల్ ఎస్టేట్ పేరుతో బడా కంపెనీలకు ఎకరాకు రూ.100 కోట్లకు అమ్ముకుందని ఆరోపించిన ఆయన తిరిగి ఆ భూములు పేదలకు ఇవ్వాలన్నారు. పెండింగ్ లో ఉన్న హాస్టల్హౌమెస్ చార్జీలు విడుదల చేయాలన్నారు.గురుకులంలో విద్యార్థిని ఆత్మహత్యపై స్పందించిన ఆయన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో సైకాలజీ కౌన్సిలర్లను నియమించాలని ప్రభుత్వానికి సూచించారు. పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో 17 స్థానాలకు బీఎస్పీ పోటీ చేస్తుందని, పొత్తులపై బీఎస్పీ అధినేత్రి మాయావతి నిర్ణయమే తుది నిర్ణయమని ప్రకటించారు. బీఎస్పీ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి నుంచి గుణపాఠాలు నేర్చుకుంటామన్న ఆయన వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అంతకుముందు చంద్రకల్, దేశి ఇటిక్యాలలోహాపార్టీ జెండా ఆవిష్కరించారు.

# ఫుడ్ సేఫ్టీ అధికారులపై చర్యలు తీసుకోవాలనీ కలెక్టర్ కు వినతి

**ప్రాణలతో చెలగాటమాడుతున్న కల్తీ కేటుగాళ్లపై చర్యలకు డివైఎఫ్ఐ పిర్యాదు**




హనుమకొండ, జనవరి 08 (తీన్మార్ న్యూస్): ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ప్రజలు తినే ఆహార పదార్థాల తయారీలో శుభ్రత పాటించకుండా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వాటిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ హనుమకొండ జిల్లా ఫుడ్ సేఫ్టీ, అండ్ కంట్రోల్ అధికారులకు అనేకసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని, వారికి అండగా నిలబడుతూ వత్తాసు పలికే విధంగా వ్యవరిస్తున్న ఫుడ్ సేఫ్టీ అండ్ కంట్రోల్ అధికారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి. తిరుపతి, హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ కు వినతిపత్రం అందజేశారు. హనుమకొండ నగరంలో హొటల్, బిర్యాని, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, బేకరీలు ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదు. సీట్ హౌస్ ల వద్ద స్వీట్ తయారు చేసేవారు చేతులకు బ్లౌజులు పెట్టుకోవడం లేదని, రెండు చేతులతో లడ్డూలను తయారు చేస్తున్నారని, తయారుచేసిన స్వీట్ పై ఈగలు వాలడం దుమ్ము పడటం, వాటిలో బ్యాక్టీరియా చేరడం జరుగుతుంది, బాగా మరిగించిన ఆయిల్ లోనే సమోసాలు, పకోడీ, మిర్చీలు, కాల్చడం, మరిగించిన నూనెను మళ్లీ తెల్లారి వాడటం జరుతుంది. ఇష్టానుసారంగా రేట్లు పెంచి అమ్ముతున్నారు. రోడ్లమీద జిలేబిలు తయారు అదే పద్ధతిలో జరుగుతుంది. నాలాల పక్కన మీద స్వీట్ హౌస్ నిర్వహణ చేయడం వల్ల అందులో ఉన్న దుర్గంధము ఈగలు దోమలు వాటి మీద చేరుతున్నాయి, బేకరీలలో నిలువ ఉంచిన పదార్థాలను కుళ్ళి పోయిన వాటిని అమ్ముతున్నారు. ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో కల్తీ నూనెను వాడుతూ ప్రజల అనారోగ్యానికి కారణం అవుతున్నారు, చికెన్, మటన్ సెంటర్లలో మిగిలిన వాటిని తక్కువ ధరకు బిర్యాని సెంటర్లకు పంపించడం వాటిని వండి ప్రజలకు పెడుతున్నారు. నగరంలోని ప్రజల ప్రాణలతో చెలగాటమాడుతున్న బిర్యాని ఫాస్ట్ ఫుడ్ స్వీట్ హౌస్ బేకరీ తనిఖీలు నిర్వహించి,చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు.

# బాలికల పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా అదనపు కలెక్టర్









గోవిందరావుపేట, జనవరి 08 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను సోమవారం ములుగు జిల్లా అదనపు కలెక్టర్ పి. శ్రీజ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఉపాధ్యాయుల హాజరు పట్టిక, వంటగది, స్టోర్ రూమ్ పరిశీలించారు.పాఠశాలలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఉపాధ్యాయులను,విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని కొన్ని వాష్ రూమ్స్, ఆర్ ఓ వాటర్ ప్లాంట్ మరమ్మతులు చేయించాలని పాఠశాల విద్య అధికారి అదనపు కలెక్టర్ను కోరారు. అనంతరం ములుగు మండలంలోని జీవాంతరాపల్లి ఆదర్శ పాఠశాలలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి వెంకట లక్ష్మి పాఠశాల ఉపాద్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మునిపంపుల లో రాములోరి అక్షింతలు పంపిణి

రామన్నపేట, జనవరి 08(తీన్మార్ న్యూస్): మండలంలోని మునిపంపుల గ్రామంలో అయోధ్య రామ మందిరం అక్షింతల వితరణ కార్యక్రమం రామాలయ గుడిలో పూజల అనంతరం గడపగడపకు అక్షింతలు పంపిణీ చేశారు. గ్రామంలో వీధుల గుండా శ్రీరామ నామ భజన చేస్తూ ఊరేగింపు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో జానకి రాములు, మన్నే పద్మా రెడ్డి, మామిండ్ల కుమార్, దోగిపర్తి భాస్కర్, ప్రభాకరా చారి, మిరియాల శ్యాంసుందర్, గంజి రామ్ లక్ష్మయ్య, ఏలూరి శ్యామ్, యదాసు లక్ష్మణ్, కూనూరు ఆంజనేయులు, ఏలూరు రవి, పున్న శ్రీకాంత్, అదొండ బాలరాజ్, రావుల నవీన్, తదితరులు పాల్గొన్నారు.



## కుర్రారం లో అయోధ్య రాములోరి అక్షింతల వితరణ



రాజాపేట, జనవరి 08(తీన్మార్ న్యూస్): రాజపేట మండలం, కురారం గ్రామంలో అయోధ్య రాముని పాదస్పర్శ అక్షింతల వితరణ కార్యక్రమం గడపగడపకు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ప్రత్యేక కలశాలతో ఊరేగింపుగా గ్రామంలోన వీధుల గుండా శ్రీరామ నామ భజన చేస్తూ ఊరేగింపుగా ఇంటింటికి అక్షింతలు, అయోధ్య అక్షింతలు,కరపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, భక్తులు, యువకులు, చిన్నారులు, అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.

# రాత్రి వేళల్లో ఇసుక అక్రమ తరలింపు

గూడూరు:ఇసుక అక్రమ తవ్వకాల్లో వైకాపా నాయకులు మునిగి తేలుతున్నారు. రవాణా చేసే ట్రాక్టర్లపై ఏకంగా ముఖ్యమంత్రి చిత్రాలు పెట్టుకోవడం.. ట్రక్కులకు వైకాపా రంగులేసి మరీ తరలిస్తున్నారు. ఇలా వరదల నుంచి తేరుకుంటున్న నదీ ప్రాంతాల్లో ఇసుక దొంగలుగా తెగబడుతున్నారు. రాత్రి వేళల్లో విచ్చల విడిగా తవ్వేస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల సహకారం మెండుగా ఉండటంతో నేతలు ఆడిందే ఆటగా సాగుతోంది. వర్షాల నేపథ్యంలో ఇసుక కొరతను సొమ్ము చేసుకుంటూ ట్రాక్టర్ ఇసుక ధర రూ.8 వేలకు అమ్ముతున్నారు. కొందరు నిల్వ చేసి ధర పెంచి విక్రయిస్తున్నారు. ఇదంతా తెలిసినా అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. జిల్లాలోని స్వర్ణముఖి, కాళంగి నదుల్లో అధికారిక రీచ్‌లు ఎక్కడా లేవు. యార్డుల నుంచి మాత్రమే ఇసుక తీసుకెళ్లడాననికి అనుమతి ఉంది. పూడిక తీయడానికి అనుమతులు లేవు. ఇవన్నీ కాదని కొందరు అక్రమంగా ఇసుక తవ్వి తరలిస్తున్నారు. స్వర్ణముఖి నదిలో నీటి ప్రవాహం తగ్గడంతో ఇసుక తోడేళ్లు చొరబడ్డాయి. నాయుడుపేట మండలం తుమ్మూరు, తిమ్మాజికండ్రిగ, చిట్టమూరు మండలం గునపాటిపాళెం, మెట్టు ప్రాంతాల్లో ఇసుక తరలిస్తున్నారు. ఇక్కడ నుంచి ట్రాక్టర్లతో తీసుకెళు_న్నారు. వాటిని నిల్వ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన టన్ను ధర రూ.675 కాగా అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. నిర్మాణదారులతోపాటు పక్కా ఇళ్ల లబ్ధిదారులు ఇసుక కోసం నానా తంటాలు పడుతున్నారు. అక్రమ నిల్వలు: స్వర్ణముఖీ తీరం వెంబడి రహదారుల అనుకుని చాలా చోట్ల ఇసుక నిల్వలు ఉంచారు. వీటిల్లో ఉన్న ఇసుక వైకాపా నేతలకు సబంధించింది కాగా ఇక్కడ ట్రాక్టర్ ఇసుక రూ.8 వేలకు పైగా కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఉదాహరణకు పెళ్లకూరు మండలం పెన్నేపల్లి గ్రామం ఆలయం వద్ద.. ఇదే ప్రాంతంలో ఓ అపార్ట్‌మెంట్ వెనుక నిల్వలున్నాయి. ఇక్కడి నుంచి ఇసుక తరలించి కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. వీరంతా వరదలకు ముందు ఇసుక నిల్వ చేయడంతో గిరాకీ పెరిగింది. ప్రత్యేక కాపలా వ్యవస్థ: ఇలా ఇసుక తవ్వకాల సమయంలో ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేసుకోవడం గమనార్హం. ఎక్కడైనా అధికారి వస్తున్నట్లు గుర్తిస్తే వెంటనే యంత్రాలు పక్కకు వెళ్తాయన్న మాట. పట్టుకుంటే వదలి పెట్టేవరకు వదలరు. ఏకంగా రాత్రయినా ప్రజాప్రతినిధికి ఫోన్ వెళ్తోంది.. తమ వారే వదిలిపెట్టేయాలన్న హెచ్చరికలు వచ్చేస్తున్నాయి. దీంతో అధికారులు కూడా వంతు పాడక తప్పడంలేదు. కరకట్టలు బలహీనం చేసి చొచ్చుకొస్తున్నా జలవనరుల శాఖ పట్టనట్లు వ్యవహరిస్తోంది. మావాళ్ల



వద్దే తీసుకోవాలని హుకుం: ప్రజాప్రతినిధులకు దగ్గరగా ఉంటున్న కొందరు నేతలు పరిశ్రమలు, ఇతర వర్గాల వారికి హెచ్చరికలు చేస్తున్నారు. మా వాళ్ల వద్దే ఇసుక తీసుకోవాలని హుకుం చేస్తున్నారు. ఇలా పెళ్లకూరు మండలంలోని ఓ పరిశ్రమకు ఇసుక తోలకంపై ఇద్దరు వైకాపా ప్రజాప్రతినిధుల మధ్య వివాదం చోటు చేసుకోగా ఓ బడా నేత అరంగేట్రం చేసి తన అనుచరుడికి అండగా నిలిచారు. ఇలా ఇక్కడ ఇసుక తరలింపుపై దుమారం రేగుతోంది. నాయుడుపేట పట్టణంలో ఇసుక ఎక్కడికి తరలించాలన్నా.. ఓ నేత అనుమతి తీసుకోవాల్సి ఉంది. సదరు నేత పట్టణం, పల్లెల్లో పెత్తనం చేస్తుండగా అతని అనుచరుల ట్రాక్టర్ల నుంచే ఇసుక తీసుకోవాలని ఆదేశాలివ్వడం గమనార్హం. ఈ ట్రాక్టర్లు ఎక్కడా ఆగడానికి లేదు. ఇటు పోలీసులు, సెబ్ అధికారులు ఇక్కడికి వెళ్లడానికి భయపడుతున్న పరిస్థితి.

# బడులపై విద్యుత్తు బకాయిల బండ

పుట్టపర్తి : శ్రీసత్యసాయి జిల్లాలో ప్రాథమిక 1159, ప్రాథమికోన్నత 230, ఉన్నత పాఠశాలలు 307 ఉన్నాయి. విద్యుత్తు బకాయిలు నాలుగు నెలలుగా చెల్లించకపోవడంతో పేరుకుపోతున్నాయి. బిల్లులు పాఠశాలల పాలిట శరాఘాతంగా పరిణమించాయి. నాడు-నేడు కింద పాఠశాలల్లో జరుగుతున్న పనులకు విద్యుత్తు వినియోగం ఉండటంతో బిల్లులు అధికంగా వస్తున్నాయి. ఒక్కో ప్రాథమిక పాఠశాలకు నెలకు రూ.600 నుంచి రూ.1000, ప్రాథమికోన్నత పాఠశాలలకు రూ.1000 నుంచి రూ.1500 వరకు, ఉన్నత పాఠశాలలకు రూ.2 వేల నుంచి రూ.3 వేలకు పైగా బిల్లులు వస్తున్నాయి. వీటిని చెల్లించడం పాఠశాలలకు భారంగా మారింది. కనీసం పాఠశాల గ్రాంటు నుంచి చెల్లిస్తామంటే.. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి నయాపైసా విడుదల కాలేదు. దీంతో ఏం చేయాలో తెలియక ఉపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు. నాలుగు నుంచి ఆరునెలల వరకు విద్యుత్తు బిల్లులు చెల్లించకపోవడంతో.. నెలానెలా బిల్లులకు తోడు బకాయిలకు అదనపు రుసుం విధిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా పాఠశాలల విద్యుత్తు బిల్లులు రూ.కోట్లలో పేరుకుపోయాయి. విద్యాశాఖ మంత్రి ఇచ్చిన హామీ ఎప్పటికి అమలవుతుందోనని ప్రధానోపాధ్యాయులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యుత్తు బిల్లులను ప్రతినెలా ప్రభుత్వం చెల్లిస్తుంది. బిల్లులను సమగ్ర శిక్షాభియాన్ అధికారులకు పంపితే ప్రభుత్వం అందుకు సంబంధించిన నిధులు విడుదల చేస్తుంది.' విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ నాలుగున్నర నెలల కిందట చేసిన ప్రకటన ఇది. దీంతో నాటి నుంచి బిల్లులను హెచ్ఎంలు పంపుతున్నా.. ప్రభుత్వం చెల్లించకపోవడంతో.. నెలనెలా బకాయిలు పేరుకుపోతున్నాయి. పుట్టపర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు నాలుగున్నర నెలలుగా విద్యుత్తు బకాయి లు చెల్లించలేదు. ప్రతినెలా రూ.2 వేల నుంచి రూ.3 వేల



వరకు బిల్లు వస్తుంది. సకాలంలో చెల్లించకపోవడంతో అదనపు రుసుంతో కలిసి బకాయిలు రూ.18,200 చేరింది. విద్యుత్తు అధికారులు బకాయిలు చెల్లించాలని పాఠశాల వద్దకు వెళ్లి ఉపాధ్యాయులపై ఒత్తిడి చేస్తున్నారు. కొత్తచెరువు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు నాలుగు నెలలు విద్యుత్తు బకాయిలు రూ.13,650, బాలిక ఉన్నత పాఠశాలకు రూ.13,250 చెల్లించాల్సి ఉంది. బీసీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో రూ.11 వేలు చెల్లించాల్సి ఉండటంతో సిబ్బంది సరఫరా తొలగిస్తామని చెప్పారు. దీంతో ప్రధానోపాధ్యా యుడు బాబాసాహెబ్ సొంతంగా రూ.5 వేలు చెల్లించారు. ఇలాగే లోచర్ల ప్రాథమికోన్నత పాఠశాలకు సంబంధించి ప్రధానోపాధ్యాయురాలు భానుప్రియ రూ.6 వేలు చెల్లించారు. పాఠశాలల విద్యుత్తు బకాయిలు చెల్లించాలని, ఉపాధ్యాయులను కోరుతున్నాం. ఒక్కొక్క పాఠశాల నుంచి నాలుగు నుంచి ఆరు నెలల విద్యుత్తు బకాయిలు వసూళ్లు కావాల్సివుంది. డిసెంబరులోగా చెల్లించాలని నోటీసులు పంపుతున్నాం, చెల్లించకుంటే విద్యుత్తు సరఫరా తొలగిస్తాం.

# గుట్టుచప్పుడు కాకుండా..గుట్ట చదును

కదిరి: జాతీయ రహదారికి ఆనుకుని ఉన్నగుట్టపై కన్నేసి గంటల వ్యవధిలో చదును చేశారు.పట్టణానికి ఐదు కిలోమీటర్ల దూరంలో జాతీయ రహదారి 42 ఆనుకుని ఉన్న సర్వేనంబరు 41లో 19 ఎకరాల్లో గుట్ట విస్తరించి ఉంది. ఐదెకరాలు మురుగునీటి శుద్ధి కేంద్రం కోసం మున్సిపాలిటీకి కేటాయించారు. ఈ గుట్టపై కన్నేసిన వ్యక్తులు హిటాచీల సాయంతో రెండ్రోజుల కిందట గంటల్లోనే చదును చేసేశారు. పట్టణానికి సమీపంలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిని చదునుచేసినా రెవెన్యూ అధికారులు దృష్టికి రాకపోవడంపై గతంలో పట్టాల పొందిన రైతులతోపాటు స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. కోట్ల రూపాయల విలువచేసే సుమారు పది ఎకరాల భూమిని చదును చేశారు. ఇక్కడ 2005లో నలుగురు రైతులకు 4 ఎకరాల అసైన్డ్ పట్టా ఇచ్చారు. పట్టా పొందిన రైతులు సాగు చేయలేదు. దీన్ని ఆసరాగా చేసుకున్న కొందరు వ్యక్తులు గుట్టపై కన్నేశారు.
అధికారపార్టీ నాయకుల అండతో వారి అనుయాయులే గుట్టను చదును చేశారం టూ పట్టాలు పొందిన రైతులు అధికారులకు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ సిబ్బందికి విషయం తెలిసినా అధికారపార్టీ నాయకుల ఒత్తిళ్లతో మిన్న కుండిపోయారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



పట్టణ సరిహద్దుల్లోని విలువైన భూములు అన్యాక్రాంతమవుతున్నా.. పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి ప్రభుత్వ భూములను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. సర్వేనంబరు 41లో వాగుకు ఆనుకుని ఐదెకరాలు మురుగునీటి శుద్ధి కేంద్రం కోసం మున్సిపాలిటీకి కేటాయించాం. ఐదు కిలోమీటర్లలోపు ఉన్నం దున ఇక్కడ అసైన్డ్ కూడా ప్రతిపాదించలేదు. గుట్టను ఎవ్వరూ చదును చేశారో పరిశీలించాలని సిబ్బందిని ఆదేశిస్తాం. గుట్టను తవ్వినవారిని గుర్తించి చర్యలు తీసుకుంటాం.

# వేతనాలివ్వకుంటే ఎలా బతికేది?



అనంతపురం : ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు ఇవ్వాలని చట్టంలో ఉంది. రెండేళ్లుగా రాష్ట్రంలో ఒకటో తేదీ జీతం ఇవ్వడం గగనం అవుతోంది. ఇప్పటికే ఇరవై రోజులు దాటుతున్నా జీతాలు పూర్తిగా ఇవ్వలేదు. వేతనాలే ఇవ్వకపోతే ఎలా బతకాలి.. అని ఏపీ ఐక్య ఉపాధ్యాయ సంఘం (యూటీఎఫ్) నాయకులు డీఆర్ఓ గాయత్రీదేవితో తీవ్ర ఆవేదన, అసంతృప్తి వ్యక్తపరిచారు. ఆమెకు వినతిపత్రం అందజేశారు. ఆ తర్వాత ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య, రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వర్‌రావు మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు జీతాలు సక్రమంగా ఇవ్వలేదని చెప్పారు. రోజువారి ఖర్చులకే కాదు.. బ్యాంకు రుణాలకు కంతుల చెల్లింపు కోసం చాలా ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. దీంతో అపరాధ రుసుం చెల్లించాల్సి వస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పీఆర్‌సీ బకాయిలు రూ.6,246 కోట్లు, పీఆర్‌సీ కంటే ముందు డీఏ బకాయిలు రూ.1,136 కోట్లు, కొత్త డీఏల అరియర్స్ రూ.2,500 కోట్లు, పీఎఫ్ రుణాల చెల్లింపులు రూ.1000 కోట్లు, సరెండర్ లీవుల బకాయిలు రూ.250 కోట్లు, తుది చెల్లింపులు రూ.300 కోట్లు.. ఇలా మొత్తం రూ.11,462 కోట్లు ప్రభుత్వం చెల్లించాల్సి ఉందన్నారు. నాలుగేళ్లగా ఇదే తంతు కొనసాగుతున్న ప్రభుత్వం కనీస స్పందన లేదని ఆరోపించారు. వీటి సాధన కోసమే దశల వారి ఉద్యమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఈనెల 21 దాకా వినతులు ఇవ్వడం, 27న తాలుకా, డివిజన్ కేంద్రాల్లో 6 గంటలు ధర్నా, జనవరి 3న జిల్లా కేంద్రంలో 12 గంటలు ధర్నా, 7, 8న రాష్ట్ర స్థాయిలో 36 గంటలు నిరసన.. వంటి ఆందోళనలు చేపట్టామన్నారు. డీఆర్‌ఓను కలిసిన వారిలో యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు రమణయ్య, జిలఆల ఉపాధ్యక్షురాలు సరళ, దేవేంద్రమ్మ, జిల్లా కార్యదర్శి రఘురామయ్య, ఆడిట్ కన్వీనర్ సుబ్బరాయుడు, గంగాధర్, రాజుకుల్లాయప్ప పాల్గొన్నారు.

# సాగునీరు ఇచ్చే వరకూ ఉద్యమం



ఉరవకొండ : ఇక్కడి చెరువులకు గాని. పంటలకు గాని నీరివ్వకుండా కృష్ణా జలాలను పుంగనూరుకు తరలించడం ఏమిటి?. ఈ దౌర్భాగ్యం ఎక్కడా ఉండదు. ఒక్క తడికి నీరివ్వమని అడిగినా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ మండిపడ్డారు. కృష్ణా జలాలను తరలించాలని జీబీసీ ఆయకట్టు రైతులు అనంతపురం-బళ్లారి జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలను కాపాడి.. రైతులను ఆదుకోమని తాము అడుగుతుంటే.. వైకాపా నాయకులు మాత్రం ఓట్లను తొలగించాలని సీఎంను, ప్రభుత్వ పెద్దలను కలుస్తున్నారని దుయ్యబట్టారు. పంటలు కాపాడేందుకు ప్రయత్నిస్తుంటే అధికార పార్టీ నాయకులు తమపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. నీరు తరలించేంత వరకూ రైతుల పక్షాన ఉద్యమిస్తామన్నారు. నీరిచ్చి ఆదుకోవాలని నిరసన తెలిపితే పోలీసులు అరెస్టు చేయడం దారుణమని రైతులు మండిపడ్డారు. విడపనకల్లు తహసీల్దారు కార్యాలయాన్ని ముట్టడిస్తే రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామన్న అధికారులు పట్టించుకోలేదని దుయ్యబట్టారు. దీంతోనే తాము రోడ్డెక్కాల్సి వచ్చిందన్నారు. తమకు మద్దతు ఇచ్చిన నాయకులను అరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఏపీ ఐడీసీ మాజీ డైరెక్టర్ దేవినేని పురుషోత్తం, విడపనకల్లు తెదేపా మండల కన్వీనర్ చిన్న మారయ్య, నాయకులు మారయ్య, సన్నప్పయ్య, తిమ్మప్ప, యర్రగుంట్ల వెంకటేశ్, భీమలింగచౌదరి, ముక్కర జయరామిరెడ్డి, కావలి తిప్పన్న, తిప్పయ్య, మల్లికార్జున, రామాంజనేయులు, వన్నూరుస్వామి, కుమార్, రాజన్న, మాబుసాబ్, సుంకురత్నమ్మ, ప్యారం కేశవ, నెట్టెం రాంబాబు, పుట్టన్నస్వామి, మోపిడి గోవిందు, ఎర్రిస్వామి, జనసేన నాయకులు గౌతమ్, చంద్రశేఖర్, సీపీఐ నాయకులు మల్లికార్జున, సుల్తాన్, సర్పంచులు చంద్రశేఖర్, తిప్పారెడ్డి, తిమ్మ రాజు, జనార్దన్ నాయుడు, హనుమంతురెడ్డి తదితరులు పాల్గొన్నారు. రైతుల ఆందోళనతో జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌తో కలెక్టరు గౌతమి చరవాణిలో మాట్లాడారు. జీబీసీకి కృష్ణా జలాల తరలింపు అవసరాన్ని ప్రస్తావిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపుతామని ఆమె పేర్కొన్నారు. జీబీసీ ఆయకట్టు కింద ఏఏ పంటలు, ఎంత మేర సాగులో ఉన్నాయన్న దానిపై నివేదిక ఇస్తామని కలెక్టర్ వివరించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

# అనుమతి లేకుండా పైప్‌లైన్ పనులు
# వైకాపా నాయకులను ప్రశ్నించిన కౌన్సిలర్



తాడిపత్రి,:తాడిపత్రిలోని ఆసుపత్రిపాళెంలో మంగళవారం ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. వైకాపా నాయకులు మున్సిపాలిటీ అనుమతులు లేకుండా అనధికారికంగా తాగునీటి పైపులైను పనులు చేస్తుండటంపై స్థానిక 27వ వార్డు తెదేపా కౌన్సిలరు రేష్మాపర్వీన్ ప్రశ్నించారు. ఈ క్రమంలో ఇరు పార్టీల శ్రేణుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ విషయం తెలిసి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సంఘటనా స్థలం వద్దకు కార్యకర్తలతో చేరుకున్నారు. దీంతో కాలనీలో ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. ఈ సమాచారం తెలియడంతో శిక్షణ డీఎస్పీ హేమంత్‌కుమార్ పోలీసు బందోబస్తుతో అక్కడికి వచ్చి ఇరు వర్గాల వారిని పంపించారు. వార్డు కౌన్సిలర్ రేష్మాపర్వీన్ విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల వైకాపా కండువా కప్పుకొన్న జిలాన్‌బాషా మరికొంత మంది తనపై అసత్య ఆరోపణలు చేస్తూ.. ఉద్దేశపూర్వకంగా తన వార్డులో అనధికారికంగా తాగునీటి పైపులైను పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. తాగునీటి పైపులైన్ సమస్యపై కౌన్సిల్‌లో ఇది వరకే ప్రస్తావించానని, పలుమార్లు మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి.. వినతిపత్రం ఇచ్చానని వివరించారు. పనులు మీరెందుకు చేస్తున్నారని అడిగినందుకు తనతో గొడవకు దిగారని ఆమె పేర్కొన్నారు. కాలనీలో ప్రజలకు నీటి సౌకర్యం కల్పించేందుకు గతంలో మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి వీధి ట్యాంకులు, బోర్లు వేయించారన్నారు. ఇన్నాళ్లు లేనిదీ ఇప్పుడు అధికార పార్టీ నాయకులు ఎందుకొస్తున్నారని ఆమె ప్రశ్నించారు. పనులు చేస్తుంటే స్థానికులు కూడా వారిని ప్రశ్నించారన్నారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ అబ్దుల్ రహీం, కౌన్సిలర్లు మల్లికార్జున, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

# తెరుచుకోని అంగన్‌వాడీ కేంద్రాలు

అనంతపురం: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీల నిరవధిక సమ్మెను నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం తొలిరోజు నుంచి యత్నించినా ఫలితం ఒనగూరలేదు.స్వయంగా అనంత, శ్రీసత్యసాయి జిల్లాల కలెక్టర్, జేసీలు సైతం రంగంలోకి దిగినా పూర్తి స్థాయిలో కేంద్రాలను తెరిపించలేకపోయారు. పిల్లలను కేంద్రాలకు రప్పించి పౌష్టికాహారాన్ని పంపిణీ చేయలేని దుస్థితి నెలకొంది. సిబ్బంది సమ్మె మంగళవారం నాటికి ఎనిమిదో రోజుకు చేరుకుంది. మంగళవారం 'న్యూస్‌టుడే' బృందం అనేక కేంద్రాలను పరిశీలిస్తే చాలా చోట్లా కేంద్రాలు మూతపడ్డాయి. సమ్మె ప్రారంభంలో బలవంతంగా తాళాలు పగలగొట్టారు. ఆ తర్వాత సచివాలయ సిబ్బంది వేరే తాళాలు వేసుకుని వెళ్లారు. ఆ తర్వాత రోజుల నుంచి కేంద్రాలను తెరిచేవారే లేరు. తాళాలు పగలగొట్టి తెరిచిన కేంద్రాల్లో ఒకటి రెండు రోజులు సచివాలయ సిబ్బందిని నియమించారు. చాలా ప్రాంతాల్లో వీరు వెళ్లకపోవడంతో ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలకు అప్పగించారు. వీరు కూడా ససేమిరా అనడంతో వాలంటీర్లపై ఆధారపడింది. తాజాగా డీఆర్‌డీఏ-వైకేపీ, మెప్మా ప్రాజెక్టుల ఏపీఎం, సీసీ, యానిమేటర్లను రంగంలోకి దింపుతోంది. పిల్లలను పిలుచుకుని వచ్చి.. వంటా వార్పు చేసే బాధ్యతను డ్వాక్రా సంఘాల సభ్యులకు అప్పగిస్తున్నారు. గుత్తి, అనంత అర్బన్, కంబదూరు, కళ్యాణ దుర్గం, సీకేపల్లి, నల్లమాడ, ఓడీసీ, కదిరి, సోమందేపల్లి, మడకశిర, ధర్మవరం వంటి ప్రాజెక్టుల పరిధిలో వంటా వార్పు కష్టంగా మారింది. దీనికితోడు గ్యాస్, కూరగాయలు సమస్య తలెత్తింది. కొన్ని ప్రాంతాల్లో కంటి తుడుపుగా సమీప పాఠశాలల్లో భోజనాన్ని తెచ్చి పెడుతున్నారు. అనంత నగరం, తాడిపత్రి, హిందూపురం, పెనుకొండ వంటి ప్రాంతాల్లో అంగన్‌వాడీ టీచర్లు వచ్చే దాకా పిల్లలను పంపమని స్వయంగా తల్లి దండ్రులే తెగేసి చెప్పారు. ఈ నెలలో రెండు దఫాలే సరకులు సరఫరా చేస్తున్నారు. సిబ్బంది సమ్మెకు వెళ్లే రెండు రోజులు ముందే బాలింత, గర్భిణి,మూడేళ్లలోపు పిల్లలకు ఒక విడత కోడిగుడ్లు, పాలు, 3 కిలోల బియ్యం,కిలో కందిపప్పు, అర లీటరు వంట నూనె.. వంటి పౌష్టికాహారాన్ని అందజేశారు. రెండో విడతగా ఈనెల 22 నుంచి పంపిణీ చేయాల్సి ఉంది. రాగి పిండి,అటుకులు,బెల్లం, వేరుసెనగ చిక్కీ, ఎండు



ఖర్జూరం, కోడిగుడ్లు, పాలు, బాలామృతం.. వంటి వా టిని అందించాలి. సిబ్బంది సమ్మెలో ఉండటంతో ఆ సరకులు తీసు కోడానికి ఎవరూ ముందుకు రాలేదు. చాలా ప్రాంతాల్లో వీరు వెళ్లకపో వడంతో ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలకు అప్పగించారు. వీరు కూడా ససేమిరా అనడంతో వాలంటీర్లపై ఆధారపడింది. తాజాగా డీఆర్‌డీఏ-వైకేపీ, మెప్మా ప్రాజెక్టుల ఏపీఎం, సీసీ,యానిమేటర్లను రంగంలోకి దింపుతోంది. పిల్లలను పిలుచుకుని వచ్చి.. వంటా వార్పు చేసే బాధ్యతను డ్వాక్రా సంఘాల సభ్యులకు అప్పగిస్తున్నారు. గుత్తి, అనంత అర్బన్, కంబదూరు, కళ్యాణదుర్గం, సీకేపల్లి, నల్లమాడ, ఓడీసీ, కదిరి, సోమందేపల్లి, మడకశిర, ధర్మవరం వంటి ప్రాజెక్టుల పరిధిలో వంటా వార్పు కష్టంగా మారింది.కొన్ని ప్రాజెక్టుల పరిధిలో సచివాలయ సిబ్బందే పౌష్టికాహారాన్ని కేంద్రాలకు దింపుతున్నారునిల్వ చేస్తున్నారు. కొన్నిచోట్ల ఏకంగా లబ్ధిదారులకు అందిస్తున్నారు. గుత్తి ప్రాజెక్టులో ఓ ఏఎన్ఎం లబ్ధిదారులకు ఇస్తున్నామని చెబుతున్నారు. అసలు లబ్ధిదారులు ఎవరు అన్న వివరాలు తెలీదు. హడావుడిగా సరకులను తీసుకోవడం, లబ్ధిదారులకు ఇవ్వడం, రోజు వారి ఫీడింగ్ విషయాల్లో ప్రభుత్వానికి తప్పుడు నివేదికలు పంపుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని 5,126 కేంద్రాలకు గాను కనీసం రెండు వేలు కూడా తెరుచుకోలేదు.

## సామూహిక మరుగుదొడ్ల నిర్మాణం
# పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం

చిత్తూరు: స్వచ్ఛ ఆంధ్రప్రదేశే ధ్యేయంగా అడుగులు వేస్తున్నామని జగన్ సర్కార్ ప్రతిసారీ ప్రకటనలు గుప్పిస్తోంది. పల్లెలే దేశానికి పట్టుగొమ్మలన్న మహాత్ముని మాటలను స్ఫూర్తిగా తీసుకున్నామని గొప్పలు చెబుతోంది. ఈ క్రమంలో 'క్లీన్ ఆంధ్రప్రదేశ్' తరహా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని అంటోంది. గ్రామాల్లోని సామూహిక మరుగుదొడ్ల నిర్మాణ వేగం, నిర్మించిన వాటి నిర్వహణ చూస్తే ముఖ్యమంత్రి, అధికార పార్టీ నాయకుల మాటలు, చేతలకు పొంతన లేదని ఇట్టే అర్థమవుతోంది. ఆడబిడ్డల ఆత్మగౌరవం కాపాడటం అంటే ఇదేనా? అన్న ప్రశ్నలు రాక మానవు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో వ్యక్తిగత, సామూహిక మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం ఇచ్చారు. స్వచ్ఛభారత్ కింద కేంద్రం ఇచ్చిన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించారు. ఈ అంశంపై అప్పటి సీఎంగా ఉన్న చంద్రబాబు తరచూ సమీక్షలు నిర్వహించడంతో యంత్రాంగం ఉరుకులు పరుగులు పెట్టింది. ఆగమేఘాలపై పనులు పూర్తి చేయించి బిల్లులు కూడా మంజూరయ్యేలా అప్పటి ప్రభుత్వం చొరవ చూపింది. ఫలితంగా పల్లెల్లో బహిరంగ మల, మూత్ర విసర్జన చాలావరకు తగ్గింది. అదే ఒరవడిని ప్రస్తుత పాలకులూ కొనసాగించి ఉంటే జగన్ చెప్పిన స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కల సాకారమయ్యేది. గ్రామాల్లో కొందరి ఇళ్లలో మరుగుదొడ్లు నిర్మించుకునేంత స్థలం లేకపోవడంతో గత ప్రభుత్వ హయాంలో సామూహిక మరుగుదొడ్లు నిర్మించాలని నిర్ణయించారు. కేంద్రం కూడా ఇందుకు ఆమోదం తెలిపింది. రూ.3 లక్షల వ్యయమవుతుందని అంచనా వేయగా 70 శాతం కేంద్ర ప్రభుత్వం, 30 శాతం రాష్ట్రం చెల్లించేలా అంగీకారం కుదిరింది. ఉమ్మడి చిత్తూరు జిల్లావ్యాప్తంగా అప్పట్లో 1,001 పనులు మంజూరయ్యాయి. ప్రస్తుత చిత్తూరు జిల్లాలో 488 చోట్ల నిర్మాణాలు మొదలుపెట్టారు. తెదేపా పాలనలో కొన్నిచోట్ల పూర్తయ్యాయి.



ఈలోపు రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో పనుల్లో వేగం తగ్గింది. ఇప్పటివరకు 323 సామూహిక మరుగుదొడ్లు అందుబాటులోకి వచ్చాయని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చెబుతున్నారు. రూ.14.64 కోట్ల వ్యయమవుతుందని అంచనా వేయగా 18 శాతం అంటే కేవలం రూ.2.65 కోట్లు ఖర్చు చేశారు. పనుల పరంగా చూస్తే 66 శాతం జరిగినట్లు ఉన్నతాధికారులకు నివేదించడం గమనార్హం. ఈ లెక్కలు చూస్తే ఎంత డొల్లతనం ఉందో అర్థమవుతోంది. మరోవైపు సామూహిక మరుగుదొడ్లు నిర్మించిన చోట వాటికి తాళాలు వేశారు. నీటి సదుపాయం లేకపోవడంతో వాటి చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. దీంతో కేంద్ర ప్రభుత్వ లక్ష్యానికి రాష్ట్ర ప్రభుత్వం తూట్లు పొడిచినట్లయింది. చేసిన పనులకు బిల్లులు రానందున పలువురు గుత్తేదారులు పంచాయతీరాజ్ సిబ్బందికి తాళాలు ఇవ్వలేదు. సిమెంటు, ఇసుక, కంకర, ఇటుకల ధరలు గణనీయంగా పెరగడంతో పలువురు మధ్యలోనే పనులు వదిలేశారు. ప్రస్తుత రేట్లకు అనుగుణంగా వ్యయాన్ని పెంచితే పునః ప్రారంభిస్తామని సమాధానమిస్తున్నారు.

# మహమ్మారి ముంచుకొస్తోంది.. మనమెంత సన్నద్ధం




రాజమహేంద్రవరం: కొవిడ్ కొత్త వేరియంట్‌పై జాగ్రత్తగా ఉండాలన్న కేంద్ర ప్రభుత్వ హెచ్చరికల నేపథ్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆయా ప్రధాన ఆసుపత్రుల్లో అధికారులు అప్రమత్తమవుతున్నారు. గతంలో కొవిడ్ సేవలందించిన ఆసుపత్రుల్లో పరీక్షలు, మందులు, పడకలు, వెంటిలేటర్లు, ఆక్సిజన్, వైద్యులు, సిబ్బందిని సిద్ధం చేస్తున్నారు. కొవిడ్ అప్రమత్తత నేపథ్యంలో రాజమహేంద్రవరం, కాకినాడ జీజీహెచ్‌ల్లో ప్రత్యేక వార్డులను అందుబాటులోకి తెచ్చారు. కాకినాడలో 20 ఐసీయూ, 30 ఆక్సిజన్, మరో 10 సాధారణ పడకలతో కూడిన ప్రత్యేక వార్డును ఏర్పాటు చేశారు. కొవిడ్ లక్షణాలకు సంబంధించి ఇచ్చే అన్ని రకాల ఔషధాలను ఉంచారు. రాజమహేంద్రవరంలో పది పడకల ప్రత్యేక ఐసీయూ వార్డును సిద్ధం చేశారు. అమలాపురం ప్రాంతీయ ఆసుపత్రి కొవిడ్ సమయంలో గత అను భవాలను దృష్టిలో పెట్టుకుని మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. గతంలో వెంటిలేటర్లు, ఆక్సిజన్ సరఫరాకు సంబంధించి కొన్నిచోట్ల ఇబ్బందులు ఏర్పడ్డాయి. ప్రస్తుతం వాటిని అధిగమించేలా అధికారులు చర్యలకు ఉపక్రమించాల్సిన అవసరం ఉంది. కాకినాడలో 50కేఎల్ లిక్విడ్ ఆక్సిజన్, 1000 ఎల్‌పీఎం పీఎస్‌ఏ ఆక్సిజన్ ప్లాంటులు అందుబాటులో ఉన్నాయి. రాజమహేంద్రవరం సర్వజన ఆసుపత్రిలో 16 కేఎల్ లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంటు, 1000 ఎల్‌పీఎం పీఎస్‌ఏ ఆక్సిజన్ ప్లాంట్లు ఉన్నాయి. ఇక్కడ 350 పడకలకు ఆక్సిజన్ సదుపాయం ఉంది. రూ.లక్షలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన పీఎస్‌ఏ ప్లాంటు పనితీరును ఇప్పటికీ నిర్ధారించలేదు. ప్రస్తుతం జలుబు, దగ్గు, గొంతునొప్పి, న్యుమోనియా, శ్వాసకోశ సంబంధిత సమస్యలతో జీజీహెచ్‌లకు రోగులు క్యూ కడుతున్నారు. ఈ నేపథ్యంలో పరీక్షలు పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కాకినాడ జీజీహెచ్‌లో రోజుకు అయిదు వేల పరీక్షలు చేయగల సామర్థ్యం ఉంది. ప్రస్తుతం ఇక్కడ రోజుకు పది నుంచి 15 నమూనాలను పరీక్షిస్తున్నారు. రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో రోజుకు 500 పరీక్షలు చేసే ఆర్టీపీసీఆర్ ల్యాబ్ అందుబాటులో ఉంది. ఈ ల్యాబ్‌లో కిట్లకు సంబంధించి ఇండెంట్ పెట్టారు. త్వరలోనే పరీక్షలు ప్రారంభించనున్నట్లు ఆర్ఎంవో డాక్టర్ నసీరుద్దీన్ తెలిపారు. అమలాపురంలోని ఆర్టీపీసీఆర్ ల్యాబ్‌లో పరీక్షలు ప్రారంభించాల్సి ఉంది. 280 వెంటిలేటర్లున్నాయి. వాటి పనితీరును తనిఖీ చేసి సిద్ధం చేయాలి. రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో 110 వెంటిలేటర్లు, వంద వరకు ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లు, మరో వంద సిలిండర్లున్నాయి. ఆసుపత్రి ఆధునికీకరణ సమయంలో వీటిని ఒకే గదిలో చెల్లాచెదురుగా పడేసి ఉంచడంపై అప్పట్లో విమర్శలొచ్చాయి. పరికరాలన్నీ పనిచేస్తున్నాయా లేదా అనే దానిపై చర్యలు చేపట్టాలి.

# అడిగితే నేరమా.. కదిలితే నిర్బంధమా..

గుంటూరు : కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు చేస్తున్న సమ్మెకు ప్రభుత్వం స్పందించకపోవడంతో నిరసనను వివిధ రూపాల్లో తెలియజేస్తున్నారు. అంగన్‌వాడీ సిబ్బంది ధర్నాలు చేయడంతో పాటు ర్యాలీలు, మానవహారాలు నిర్వహించడం ద్వారా ప్రజలకు తామెందుకు సమ్మె చేస్తున్నామనే విషయాన్ని తెలియజేసే ప్రయత్నం చేశారు. సీఎం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని అడిగితే అరాచకంగా కేంద్రాల తాళాలు పగలగొడుతున్నారని, నిరసనకు కదలితే నిర్బంధిస్తున్నారని విరుచుకుపడ్డారు. ప్రభుత్వ వైఖరిని ఎండగడుతూ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మెని కొనసాగిస్తామని నినాదాలు చేశారు. గుంటూరు కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీలు 8వ రోజూ ధర్నా నిర్వహించారు. రోడ్డు పక్కన వంటా- వార్పు నిర్వహించారు. తాడికొండలో అంగన్‌వాడీల ఆందోళనకు తెదేపా, జనసేన, సీపీఐ, సీపీఎం నాయకులు మద్దతు తెలిపారు. తాడికొండ నియోజకవర్గ సీపీఐ సమన్వయకర్త ముప్పాళ్ల శివశంకరరావు, మండల తెదేపాఅధ్యక్షుడు మండవ చిన్న నరసింహారావు మేడికొండూరు, ఫిరంగిపురంలో అంగన్‌వాడీల ధర్నా శిబిరాలను సందర్శించి వారికి



సంఘీభావం ప్రకటించారు. మేడికొండూరు ప్రధాన కూడలిలో అంగన్‌వాడీలు మానవహారం నిర్వహించి ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. రాజధాని ప్రాంతం తుళ్లూరులో అంగన్‌వాడీ సిబ్బంది ప్రభుత్వ వైఖరికి నిరసనగా జోలె పట్టి బిక్షాటన చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వేసిన తాళాల తొలగింపు కార్యక్రమాన్ని ఐసీడీఎస్ పర్యవేక్షకులు, గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు కొనసాగించారు.

# రైతుల గుండెల్లో టవర్ల గునపం



నంద్యాల: 'విద్యుత్తు' పనులు పచ్చటి పొలాల్లో మంటలు రేపుతున్నాయి. లైన్ల ఏర్పాటుకు భారీ టవర్ల నిర్మాణం పేరుతో పంటలు ధ్వంసం చేస్తున్నారు. భూసేకరణ చేయకుండా.. రైతుల అనుమతి తీసుకోకుండానే పొలాల్లో పనులు చేపడుతున్నారు. సాగులో ఉన్న పంటలను యంత్రాలతో తొక్కిస్తున్నారు. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అధికారుల తీరుతో దిగుబడులు చేతికందకుండా పోతున్నాయని కర్షకులు వాపోతున్నారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని.. తమకు జరుగుతున్న అన్యాయాన్ని ఎవరికి చెప్పాలో అర్థం కావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం నంది పాడు నుంచి కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం నన్నూరు వద్ద ఉన్న పవర్ గ్రిడ్ ట్రాన్స్‌మిషన్ సబ్‌స్టేషన్ వరకు టవర్లు ఏర్పాటు చేయాలని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నిర్ణయించింది. ఇందులో భాగంగా 765 కేవీ డబుల్ సర్క్యూట్ లైన్ పనులు చేపడుతున్నారు. తిమ్మనాయునిపేట సమీపంలో ఏర్పాటు చేసిన సౌర, పవన విద్యుత్తు ప్రాజెక్టుల ద్వారా ఉత్పత్తయ్యే రెండు రకాల విద్యుత్తును రెండు భారీ లైన్ల ద్వారా నన్నూరు వద్ద ఉన్న ట్రాన్స్‌మిషన్ కేంద్రానికి అనుసంధానం చేయాలన్నది ఈ ప్రాజెక్టు లక్ష్యం. ఇక్కడి నుంచి రాష్ట్రంతో పాటు ఇతర ప్రాంతాల అవసరాలకు విద్యుత్తును పంపిణీ చేయనున్నారు. ఇందులో భాగంగా కొలిమిగుండ్ల, అవుకు, బనగానపల్లి, పాణ్యం, గడివేముల, ఓర్వకల్లు మండలాల్లోని సుమారు 30 గ్రామాల పరిధిలో 112 కి.మీల పొడవున టవర్లు నిర్మించి ప్రత్యేక లైను ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. టవర్ల ఏర్పాటుకు గుర్తించిన భూముల్లో పనులు ప్రారంభించారు. పాణ్యం మండలం మద్దూరు, అనుపూరు, బలపనూరు, కౌలూరు, కొండజూటూరు, దుర్వేసి, గడివేముల ప్రాంతాల్లో మార్కింగ్ వేస్తున్నారు. టవర్ల నిర్మాణానికి కనిష్ఠంగా ఏడు సెంట్ల భూమి అవసరం అవుతుంది. ఇందుకోసం పొక్లెయిన్లతో పొలాల్లో ఇష్టానుసారం తవ్వేస్తున్నారు.

# దారంతా దారుణమే!

అమరావతి:అమరావతి నుంచి తుళ్లూరు వెళ్లడానికి సరైన రోడ్డు లేదు. మద్దూరు వద్ద వంతెన లేదు. వర్షం వస్తే రాకపోకలు నిలిచిపోతున్నాయి. దానిని దృష్టిలో పెట్టుకుని రూ.44కోట్లు మంజూరు చేసి మద్దూరు వంతెన నిర్మాణం ప్రారంభించాం. ఆ రోడ్డు కూడా వేశామని పెదకూరపాడు ఎమ్మెల్యే శంకరరావు జూన్‌లో సీఎం జగన్ క్రోసూరు పర్యటన సందర్భంగా బహిరంగ సభ వేదికగా గొప్పలు చెప్పారు. ప్రస్తుత పరిస్థితి: పెదమద్దూరు వద్ద వంతెన నిర్మాణం ఏడాది కిందట ప్రారంభమైనా ఇంకా పూర్తికాలేదు. మూడు నెలలుగా పనులు కూడా అర్ధంతరంగా ఆగిపోయాయి. ప్రస్తుతం ఉన్న చప్టా ఎప్పుడు కూలిపోతుందో తెలియని దుస్థితి. కొద్దిపాటి వర్షం వచ్చి వాగులో ప్రవాహం మొదలైతే రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఇదీ అమరావతి-విజయవాడ మార్గంలో పెదమద్దూరు వంతెన దుస్థితి. అక్కడక్కడా కల్వర్టుల నిర్మాణం తప్ప రోడ్డు నిర్మాణం ఇంకా ప్రారంభమే కాలేదు. నిధులు మంజూరై పనులు మొదలైనందున భారీ గోతులు పడినా మరమ్మతు చేసే పరిస్థితి లేదు. గోతుల రోడ్డులోనే రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి. అమరావతి- విజయవాడ రహదారిలో తుళ్లూరు నుంచి అమరావతి వరకు 20 కి.మీ రహదారి అభివృద్ధికి రూ.44.18 కోట్లు మంజూరయ్యాయి. పెదమద్దూరు వద్ద వాగుపై నూతన వంతెనతో పాటు రోడ్డు విస్తరణలో భాగంగా కల్వర్టులు నిర్మించాలి. రెండేళ్ల కిందట నిధులు మంజూరైనా ఏడాది తర్వాత పనులు ప్రారంభించారు. కల్వర్టులు, పెదమద్దూరు వంతెన నిర్మాణం ప్రారంభించినా ఒక అడుగు ముందుకు.. మూడడుగులు వెనక్కి అన్న చందంగా పనులు జరుగుతున్నాయి. రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేసి 14 నెలలు పూర్తయినా విస్తరణ పనులు ప్రారంభం కాలేదు. ఇక్కడి పనులు నత్తతో పోటీ పడుతుండడం, నది నుంచి ఇసుక రవాణా చేసే భారీ లారీలు ఈ మార్గంలో రాకపోకలు



సాగించడంతో రోడ్డు అధ్వానంగా మారింది. వర్షాకాలంలో గోతుల మధ్య రోడ్డు వెతుక్కోవాల్సిన దుస్థితి. వాస్తవం ఇలా ఉంటే నేతల మాటలు మాత్రం కోటలు దాటుతున్నాయి. ప్రపంచ పర్యాటక కేంద్రం, పంచారామ క్షేత్రంగా విరాజిల్లుతున్న అమరావతికి పర్యాటకులు, భక్తులు విజయవాడ వైపు నుంచి పెద్దసంఖ్యలో వస్తుంటారు. దీంతోపాటు సత్తెనపల్లి, పల్నాడు వైపు నుంచి వచ్చేవారు రాజధాని అమరావతి, హైకోర్టు, సచివాలయానికి ఈమార్గంలోనే ప్రయాణిస్తున్నారు. నాలుగేళ్లుగా ఈ రహదారిలో ప్రయాణించే వారు నరకం అనుభవిస్తున్నారు. ఈ మార్గంలో తిరిగే విజయవాడ, గన్నవరం డిపో ఆర్టీసీ బస్సులు సైతం తరచూ మరమ్మతుకు గురవుతున్నాయి. దీంతో ప్రయాణికులకు సమయానికి బస్సులు రాని పరిస్థితి. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ ఏఈ సురేష్‌ను వివరణ కోరగా వర్షం పడిన రోజు మాత్రమే వంతెన నిర్మాణ పనులు నిలిపివేస్తున్నారన్నారు. గుత్తేదారు వేరేచోట నిర్మాణ పనుల్లో ఉండడం వల్ల సిబ్బంది కొరతతో రహదారి నిర్మాణం ఇంకా చేపట్టలేదని చెప్పారు.


# అరటి తోట ధ్వంసం.. రూ.40 లక్షల నష్టం

కర్నూలు : నంద్యాల జిల్లా బండి ఆత్మకూరు మండలం కడమలకాల్వ గ్రామంలో ఆరెకరాల పొలంలోని అరటి తోటను అధికార పార్టీ నేతలు సుమారు 30 మంది ధ్వంసం చేశారు. ఈ ఘటన బాధితుడు ఖాద్రి రమణగౌడ్ మాట్లాడుతూ తాను రామసుబ్బయ్య దగ్గర 2022లో మూడేళ్ల కాలానికి ఆరెకరాలు కౌలుకు తీసుకున్నట్లు చెప్పారు. కౌలు ఒప్పందం 2025 ఏప్రిల్ నెలాఖరు వరకు ఉందని.. కౌలుకు ఇచ్చిన కొద్ది రోజులకే రామసుబ్బయ్య ఆ పొలాన్ని బగ్గి వీరారెడ్డి, మేకల పావని అనే వారికి ఒక్కొక్కరికి మూడెకరాల చొప్పున అమ్మేశారని చెప్పారు. పొలాన్ని కొనుగోలు చేసిన వీరారెడ్డి, పావనిలు పొలాన్ని ఖాళీ చేయాలని తనను కోరారని.. కౌలు సమయం ఉందని, అరటి పంట కోసం భారీగా పెట్టుబడి పెట్టానని చెప్పడంతో కొద్దిరోజులు నిరీక్షించారని చెప్పారు. కౌలు సమయం పొడిగించాలని, గుత్త చెల్లిస్తానని చెప్పినా వారు నిరాకరించంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించానని తెలిపారు. ఈ క్రమంలోసుమారు 30 మంది వ్యక్తులు ఆరెకరాల్లోని పంటను ధ్వంసం చేశారని.. రూ.40 లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా బాధిత రైతు, ప్రస్తుత భూయజమాని ఇద్దరూ వైకాపాకు చెందిన వారే కావడం గమనార్హం. గతంలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు పొలంలో కరెంటు పెట్టి తనను చంపేందుకు ప్రయత్నించారని రమణగౌడ్ ఆరోపించారు. ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్తు వైరును పొలంలో పెట్టారని... చూసుకోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందన్నారు. సోమవారం కొందరు పంట ధ్వంసం చేస్తుండగా తన కుమారుడు వారిని చూశారని.. పొలంలోకి అడుగుపెడితే పీక కోయండంటూ కొందరు అరవడంతో



భయపడి అక్కడి నుంచి వచ్చేశారని ఆరోపించారు. పంట ధ్వంసం చేశారంటూ ఫిర్యాదు పత్రం రాసి బండి ఆత్మకూరు పోలీసులకు ఇస్తే వారు కనీసం తీసుకోలేదని రమణగౌడ్ ఆరోపించారు. ఇది సివిల్ వివాదమని, న్యాయస్థానానికి వెళ్లి తేల్చుకోవాలని సూచించారంటూ కన్నీరుమున్నీరయ్యారు. చట్టబద్ధంగా అగ్రిమెంటు రాసుకుని, కౌలు కార్డు కూడా తీసుకుని, ఇ-క్రాప్‌లోనూ తాను కౌలుకు తీసుకున్నట్లు రాయించుకుని సాగు చేస్తున్నానని చెప్పారు. పంట మొత్తం ధ్వంసమై తీవ్రంగా నష్టపోయినా పోలీసులు నిందితులపై కేసు నమోదు చేయలేదని చెప్పారు. దీనిపై బుధవారం ఎస్పీని ఆశ్రయిస్తానని పేర్కొన్నారు. ఈ విషయమై బండి ఆత్మకూరు ఎస్సై మల్లికార్జున మాట్లాడుతూ కౌలు పొడిగింపు వివాదం ఇప్పటికే న్యాయస్థానంలో ఉందని.. అందుకే ఈ విషయాన్ని న్యాయస్థానంలోనే తేల్చుకోవాలని చెప్పామన్నారు.

# చీకట్లో మరమ్మతులు.. నాణ్యతకు తిలోదకాలు..!



కూర్మన్నపాలెం:జీవీఎంసీ అధికారులు మరమ్మతు పనుల పేరిట ప్రజాధనాన్ని గుత్తేదారులకు దోచిపెడుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఆరోపణలకు బలం చేకూర్చేలా గుత్తేదారులు హడావుడిగా పనులు చేస్తూ.. నాణ్యతా ప్రమాణాలు గాలికొదిలేస్తున్నారు. పనుల ప్రాంతంలో కనీసం అధికారుల పర్యవేక్షణ లేకుండా... గుత్తేదారులు చక్రం తిప్పుతున్నారు. కూర్మన్నపాలెం సమీప వడ్లపూడి ప్రధాన రహదారిలో ఎక్కడికక్కడ గోతులు ఏర్పడడంతో నిత్యం రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈ సమస్యపై పలుమార్లు ఫిర్యాదులు అందడంతో ఎట్టకేలకు అధికారులు స్పందించి రూ.10 లక్షల నిధులు మంజూరు చేశారు. పనులు దక్కించుకున్న గుత్తేదారుడు మంగళవారం రాత్రి మరమ్మతులు ప్రారంభించారు. రోడ్డుపై ఉన్న గోతుల్లో నీరు చేరి ఉన్నా... అవేమీ పట్టించుకోకుండా బీటీ లేయర్ వేస్తున్నారు. కనీసం జీవీఎంసీ వర్క్‌ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణ లేకపోవడంపై స్థానికులు నాణ్యతపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ముందస్తు సమాచారం లేకుండా పనులు చేపట్టడంతో ఎక్కడికక్కడ వాహనాలు స్తంభించి... ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. పనులు పర్యవేక్షించాలని నివాసితులు కోరుతున్నారు. గతంలో రూ.51 లక్షలు వెచ్చించినా: ఇదే రహదారికి మూడేళ్ల కిందట రూ.51 లక్షలు వెచ్చించి మరమ్మతులు చేపట్టారు. రహదారిని మూడు భాగాలుగా విభజించి రూ.20 లక్షలు, రూ.20 లక్షలు, రూ.11 లక్షలు వేర్వేరుగా మంజూరు చేశారు. అలా మూడుసార్లు చేపట్టిన పనులకు ఎమ్మెల్యే మూడుసార్లు శంకుస్థాపనలు చేశారు. మరమ్మతులు పూర్తయిన కొద్ది నెలలకే మళ్లీ రోడ్డుపై గోతులు ఏర్పడ్డాయి. నాటి నుంచి ప్రజలు గోతుల దారిలోనే ప్రయాణిస్తూ.. అవస్థలు పడ్డారు. మళ్లీ ఇప్పుడు నామమాత్రంగానే పనులు చేపట్టడంపై ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. పెద్ద మొత్తంలో నిధులు వృథా చేస్తున్నా.. పూర్తిస్థాయిలో రహదారి నిర్మించకపోవడంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# అట్రాసిటీ చట్టం దుర్వినియోగం కానీయద్దు

నరసరావుపేట: ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం దుర్వినియోగం కాకుండా చూడాలని కలెక్టర్ శివశంకర్ అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ చట్టాన్ని అవసరమైన పరిస్థితుల్లోనే వినియోగించేలా కమిటీ సభ్యులు ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. మూడేళ్లలో చట్టం కింద ఎక్కువగా కేసులు నమోదవుతున్న ప్రాంతాలను గుర్తించి అవగాహన కల్పించాలని చెప్పారు. మంచి వాతావరణం ఏర్పడేలా రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం కృషి చేయాలని తెలిపారు. కమిటీ సభ్యులకు అట్రాసిటీ చట్టంపై పూర్తి అవగాహన కల్పించేందుకు నిష్ణాతులైన వక్తలతో తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సభ్యులు కోటప్పకొండలో దుకాణ సముదాయంలో ఎస్సీలకు దుకాణాలు కేటాయించాలని కోరారు. రెంటచింతల పొలం విషయంలో వేసిన విచారణపై ప్రశ్నించారు. ఎండుగుంపాలెం గ్రామానికి బస్సు సౌకర్యం లేదని, ఈ కారణంగా ఆటో ఛార్జీలు




ఎక్కువ చెల్లించాల్సి వస్తోందని చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, సాంఘిక సంక్షేమశాఖ అధికారి ఓబుల్‌నాయుడు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# హెన్రిచ్ క్లాసెన్ సంచలన నిర్ణయం..!

హైదరాబాద్ : దక్షిణాఫ్రికా వికెట్ కీపర్ కమ్ బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. టెస్ట్ క్రికెట్కు రిటైర్మెంట్ ప్రకటించినట్లు తెలిపాడు.
తన రిటైర్మెంట్ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని 32 ఏళ్ల క్లాసెన్ చెప్పాడు. తాను తీసుకున్న ఈ నిర్ణయం చాలా కఠినమైందని, తన ఫేవరెట్ ఫార్మాట్ నుంచి అర్ధంతరంగా తప్పుకుంటున్నందుకు చాలా బాధగా ఉందని క్లాసెన్ పేర్కొన్నాడు. 2019 నుంచి 2023 మధ్య దక్షిణాఫ్రికా తరపున నాలుగు టెస్ట్ మ్యాచ్లు ఆడాడు. టెస్ట్ నుంచి తప్పుకునే విషయమై ఆలోచిస్తూ.. కొన్ని నిద్రలేని రాత్రులు గడిపా. సరైన నిర్ణయం తీసుకుంటున్నానా? అని చాలా ఆలోచించా. చివరకు నేను టెస్ట్ క్రికెట్ నుండి రిటైర్ అవ్వాలని నిర్ణయించుకున్నాను. ఇది చాలా కష్టమైన నిర్ణయం. ఎందుకంటే ఇది నాకు ఇష్టమైన ఫార్మాట్' అని హెన్రిచ్ క్లాసెన్ తెలిపాడు. 4 టెస్టుల్లో క్లాసెన్ 104 పరుగులు మాత్రమే చేశాడు. 10 క్యాచ్లు, 2 స్టంపౌట్లు అతడి ఖాతాలో




ఉన్నాయి. క్లాసెన్ 2019లో టెస్ట్ ఫార్మాట్లోకి అడుగుపెట్టిన సమయంలో క్వింటన్ డికాక్ అప్పటికే జట్టులో స్థిరపడిపోయాడు. దాంతో క్లాసెన్కు సరైన అవకాశాలు రాలేదు. విధ్వంసకర ఆటగాడు అనే ముద్ర కూడా సెలెక్టర్లు టెస్ట్ జట్టులోకి ఎంపిక చేయకపోవడానికి ఇంకో కారణం.

# రోహిత్, కోహ్లీ బ్యాక్

## అఫ్గాన్తో టీ20 సిరీస్కు జట్టు ప్రకటన

కేప్టౌన్: 2022 టీ20 ప్రపంచకప్ నుంచి పొట్టి ఫార్మాట్కు దూరంగా ఉంటున్న సీనియర్ ప్లేయర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ తిరిగి జాతీయ జట్టులోకి వచ్చారు.
ఈ ఏడాది అమెరికా, వెస్టిండీస్ వేదికగా టీ20 వరల్డ్కప్ జరగనుండగా.. సీనియర్ల అవసరం జట్టుకు ఉందని భావించిన సెలెక్షన్ కమిటీ.. వీరిద్దరినీ అఫ్గాన్తో సిరీస్కు ఎంపిక చేసింది.
పొట్టి ప్రపంచకప్నకు ముందు టీమ్ఇండియా ఆడనున్న చివరి అంతర్జాతీయ సిరీస్ ఇదే కాగా.. ఈ నెల 11 నుంచి భారత్, అఫ్గాన్ మధ్య మూడు మ్యాచ్ల టీ20 సిరీస్ ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్కు మొహాలీ ఆతిథ్యమివ్వనుంది. హార్దిక్ పాండ్యా, సూర్యకుమార్ గాయంతో జట్టుకు దూరం కాగా.. తెలంగాణ ప్లేయర్ తిలక్ వర్మ, సంజూ శాంసన్, శివమ్ దూబే, వాషింగ్టన్ సుందర్ టీమ్లో చోటు




దక్కించుకున్నారు. కేఎల్ రాహుల్, బుమ్రా, సిరాజ్, జడేజాకు ఈ సిరీస్ నుంచి విశ్రాంతినిచ్చారు. జట్టు: రోహిత్ (కెప్టెన్), గిల్, యశస్వి, కోహ్లీ, తిలక్, రింకూ, జితేశ్, శాంసన్, శివమ్, సుందర్, అక్షర్, రవి, కుల్దీప్, అర్ష్దీప్, అవేశ్, ముఖేశ్.

## సెలక్టర్ల నిర్ణయం సరైనదే!

# హార్దిక్ స్థానంలో అతడే బెటర్

అఫ్గానిస్తాన్తో సిరీస్కు 16 మంది సభ్యులతో కూడిన భారత జట్టును బీసీసీఐ తాజాగా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ సిరీస్తో టీమిండియా సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి తిరిగి టీ20ల్లో రీ ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమయ్యారు.
14 నెలల తర్వాత వీరిద్దరూ టీ20ల్లో భారత జట్టు తరపున బరిలోకి దిగనున్నారు. ఇక సిరీస్కు హార్దిక్ పాండ్యా, సూర్యకుమార్ యాదవ్, రుతురాజ్ గాయం కారణంగా దూరం కాగా.. శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్కు సెలక్టర్లు విశ్రాంతి ఇచ్చారు.
ఇక హార్దిక్ పాండ్యా స్థానంలో పేస్ ఆల్రౌండర్ శివమ్ దూబేకు సెలక్టర్లు ఛాన్స్ ఇచ్చారు. గతేడాది ఐర్లాండ్తో టీ20 సిరీస్, ఆసియా క్రీడల్లో అద్భుతంగా రాణించిన దూబేకు ఎట్టకేలకు జట్టులో చోటు దక్కింది. ఈ నేపథ్యంలో దూబేను ఉద్దేశించి భారత మాజీ క్రికెటర్ ఆకాష్ చోప్రా ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.
"శివమ్ దూబే తిరిగి మళ్లీ జట్టులోకి వచ్చాడు. సెలక్టర్లు సరైన నిర్ణయం తీసుకున్నారు. సెలక్టర్ల నిర్ణయం నన్ను ఏమి ఆశ్చర్యపరచలేదు. జట్టుకు ప్రస్తుతం హార్దిక్ పాండ్యా స్థానాన్ని భర్తీ చేసే ఆటగాడి కావాలి. ఆ సత్తా దూబేకు ఉంది. అతడిని దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్కు ఎంపిక చేస్తారని భావించాను. అతడిని సౌతాఫ్రికాకు తీసుకువెళ్లి ఉంటే విదేశీ పిచ్లపై ఎలా ఆడేవాడన్నది మేనెజ్మెంట్కు ఒక అవగహన వచ్చి




ఉండేది. కానీ సెలక్షన్ కమిటీ అతడిని పరిగణలోకి తీసుకోలేదు. స్వదేశంలో ఆసీస్ సిరీస్లో కూడా అదే పరిస్థితి. జట్టులో ఉన్నప్పటికి సిరీస్ మొత్తం బెంచ్కే పరిమితమయ్యాడు. కచ్చితంగా జట్టుకు ఆరో బౌలర్ అవసరం. కాబట్టి దుబేకు ప్లేయింగ్ ఎలెవన్లో చోటు దక్కుతుందని ఆశిస్తున్నాను" అని చోప్రా తన యూట్యాబ్ ఛానల్లో పేర్కొన్నాడు. కాగా భారత తరపున ఇప్పటివరకు 18 టీ20లు ఆడిన దూబే.. 152 పరుగులతో పాటు 6 వికెట్లు పడగొట్టాడు. మొహాలీ వేదికగా జరగనున్న తొలి టీ20తో ఈ టీ20 సిరీస్ ప్రారంభం కానుంది.

# టీ20ల్లో అరుదైన ఫీట్.. తొలి భారత

## క్రికెటర్గా రికార్డు సృష్టించిన దీప్తి

భారత మహిళల జట్టు ఆల్రౌండర్ దీప్తి శర్మ పొట్టి క్రికెట్లో అరుదైన ఫీట్ సాధించింది. విరాట్ కోహ్లీ, హిట్మ్యాన్, బుమ్రా వంటి దిగ్గజాలకు సాధ్యంకాని రికార్డును తన పేరిట లిఖించుకుంది.
టీ20ల్లో 1,000 పరుగులు పూర్తి చేసుకోవడంతో పాటు వంద వికెట్లు తీసిన తొలి భారత క్రికెటర్గా దీప్తి రికార్డు నెలకొల్పింది.
ఆదివారం డీవై పాటిల్ స్టేడియంలో ఆస్ట్రేలియాతో జరిగిన రెండో టీ20లో దీప్తి శర్మ ఈ ఘనత సాధించింది. రెండో టీ20లో టాపార్డర్ విఫలమవ్వడంతో భారత్ కష్టాల్లో పడింది. ఆ దశలో క్రీజులోకి వచ్చిన దీప్తి 30 పరుగులతో జట్టుకు గౌరవప్రదమైన స్కోర్ను అందించింది. అనంతరం బౌలింగ్లో సత్తా చాటుతూ రెండు కీలక వికెట్లు తీసింది. కానీ, ఎలీసా పెర్రీ(34 నాటౌట్), ఫొబే లిచ్ఫీల్డ్(18 నాటౌట్) అద్భుతంగా ఆడి ఆసీస్ను గెలిపించారు. దాంతో, కంగారూ జట్టు సిరీస్ సమం చేసింది.
పొట్టి ఫార్మాట్లో అత్యధిక పరుగులు బాదిన భారత క్రికెటర్ల జాబితాలో





విరాట్ కోహ్లీ అగ్రస్థానంలో ఉన్నాడు. విరాట్ 115 మ్యాచుల్లో 4,008 పరుగులు చేయగా.. రోహిత్ శర్మ 3,853 రన్స్తో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. భారత లెగ్ స్పిన్నర్ యజ్వేంద్ర చాహల్ 96 వికెట్లు, భువనేశ్వర్ కుమార్ 90 వికెట్లతో వరుసగా రెండు, మూడు స్థానాల్లో ఉన్నారు.

# టీ20 వరల్డ్ కప్లో టీమిండియా కెప్టెన్గా

## అతడే ఉండాలి.. దాదా కామెంట్స్

ఈ ఏడాది జూన్లో అమెరికా/వెస్టిండీస్ వేదికగా జరగాల్సి ఉన్న టీ20 వరల్డ్ కప్లో రోహిత్ శర్మనే కెప్టెన్గా ఉండాలని టీమిండియా మాజీ సారథి, బీసీసీఐ మాజీ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ అన్నాడు.
2022 టీ20 ప్రపంచకప్ ఓటమి తర్వాత రోహిత్కు విశ్రాంతినిచ్చిన సెలక్టర్లు.. హార్ధిక్ పాండ్యాకు ఆ బాధ్యతలు అప్పగించారు. కానీ తాజాగా అతడికి గాయంతో రోహిత్ మళ్లీ టీ20లలోకి రీఎంట్రీ ఇచ్చాడు. టీ20 వరల్డ్ కప్ 2024లో హార్ధిక్ పాండ్యా సారథ్యంలోనే భారత్ బరిలోకి దిగుతుందని వాదనలు వినిపించగా తాజాగా పాండ్యాకు గాయం, రోహిత్ రీఎంట్రీతో ఈ మెగా టోర్నీలో టీమిండియా ఎవరి సారథ్యంలో ఆడుతుందనేది చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో దాదా ఈ వ్యాఖ్యలు చేశాడు. రోహిత్, కోహ్లీలు ఇద్దరూ పొట్టి ప్రపంచకప్లో ఆడాలని, ఈ ఇద్దరూ 14 నెలల విరామం తర్వాత అఫ్గానిస్తాన్తో సిరీస్ ఆడుతున్నా.. వచ్చిన నష్టమేమీ లేదని, ఆ ఇద్దరూ రాణిస్తారని ధీమా వ్యక్తం చేశాడు. పీటీఐతో మాట్లాడుతూ దాదా తెలిపాడు. గంగూలీ మాట్లాడుతూ 'టీ20 వరల్డ్ కప్లో భారత జట్టుకు రోహిత్ శర్మ కెప్టెన్గా ఉండాలి. విరాట్ కోహ్లీ కూడా ఆ జట్టులో ఉండాలి. కోహ్లీ అద్భుతమైన ప్లేయర్. చాలా గ్యాప్ తర్వాత ఈ ఇద్దరూ టీ20 క్రికెట్ ఆడుతున్నా ఈ ఇద్దరూ రాణించగలరు..' అని అన్నాడు.
2022 నవంబర్లో ఆస్ట్రేలియా వేదికగా ఇంగ్లండ్తో ముగిసిన టీ20



వరల్డ్ కప్ సెమీస్లో ఓడిన తర్వాత రోహిత్, కోహ్లీలు అంతర్జాతీయ స్థాయిలో టీ20లు ఆడలేదు.
తాజాగా ఈ ఇద్దరినీ అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ.. అఫ్గాన్తో ఈనెల 11 నుంచి మొదలుకాబోయే మూడు మ్యాచ్ల టీ20 సిరీస్లో ఎంపికచేసింది.
యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్పైనా గంగూలీ ప్రశంసలు కురిపించాడు. దక్షిణాఫ్రికా వేదికగా ఇటీవలే ముగిసిన రెండు మ్యాచ్ల టెస్టు సిరీస్లో జైస్వాల్ విఫలమైనా అతడు కెరీర్ ఆరంభంలోనే ఉన్నాడని, రాబోయే రోజుల్లో ఈ లెఫ్ట్ హ్యాండ్ ఓపెనర్కు మరిన్ని అవకాశాలు దక్కుతాయని ఆశాభావం వ్యక్తం చేశాడు.

# తోమర్కు ప్యారిస్ ఒలింపిక్స్ బెర్తు..

## 14వ భారత షూటర్గా రికార్డు

భారత స్టార్ షూటర్ వరుణ్ తోమర్ ప్రతిష్ఠాత్మక ప్యారిస్ ఒలింపిక్స్ బెర్తు దక్కించుకున్నాడు. ఆసియా ఒలింపిక్ క్వాలిఫయర్స్ లో పసిడి పతకంతో మెరిసిన అతడు విశ్వక్రీడలకు అర్హత సాధించాడు.
అర్జున్ సింగ్ చీమా, ఉజ్వల్ మాలిక్లతో కలిసి తోమర్ టీమ్ విభాగంలో దేశానికి బంగారు పతకం అందించాడు. అంతేకాదు వ్యక్తిగత విభాగంలోనూ ఫైనల్కు అర్హత సాధించాడు. తద్వారా ఈ స్టార్ షూటర్ ఒలింపిక్స్ బెర్తు దక్కించుకున్నాడు. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో అతడు విశ్వ క్రీడలకు అర్హత సాధించాడు. దాంతో భారత్ నుంచి ప్యారిస్ బెర్తు సొంతం చేసుకున్న 14వ షూటర్గా తోమర్ గుర్తింపు సాధించాడు. ఒలింపిక్స్ బెర్తు దక్కించుకున్న భారత షూటర్లు : సరబ్జోత్ సింగ్, రాజేశ్వరి కుమారి, సిఫ్త్ కౌర్ సమ్రా, మెహులీ ఘోష్, అఖిల్ షోరాన్, భౌవ్నేష్ మెండిరత్త, రుద్రాంక్ష్ పాటిల్, స్వప్నిల్ కుశాలే, శ్రియాంక సదంగి, అనిశ్ భన్వాల, మను బాకర్, తిలోత్తమ సేన్, అర్జున్ బబుతా, వరుణ్ తోమర్. నిరుడు చైనా ఆతిథ్యమిచ్చిన ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకంతో మెరిసిన తోమర్



జకర్తాలో జరుగుతున్న ఆసియా ఒలింపిక్ క్వాలిఫయర్స్లోనూ అదరగొట్టాడు. పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ టీమ్ విభాగంలో తోమర్, అర్జున్ సింగ్ చీమా, ఉజ్వల్ మాలిక్ బృందం పసిడి పతకం కొల్లగొట్టింది. వరుణ్ (586), అర్జున్(579), ఉజ్వల్ (575)లు 1,740 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచారు. ఇరాన్, కొరియా షూటర్లు వెండి, కాంస్య పతకాలతో సరిపెట్టుకున్నారు.

# న్యూలాండ్స్ పిచ్పై ఐసీసీ గుర్రు.. డీమెరిట్ పాయింట్లు విధించేనా..?

భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య కేప్టౌన్ లో జరిగిన రెండో టెస్టు రెండు రోజుల్లోనే ముగియడం క్రికెట్ పండితులను తీవ్ర విస్మయానికి గురి చేసింది.
ఐదు సెషన్లలోనే మ్యాచ్ ఫలితం తేలిపోయిన న్యూలాండ్స్ పిచ్పై దక్షిణాఫ్రికా బ్యాటింగ్ కోచ్ సహా పలువురు క్రికెటర్లు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. దాంతో, న్యూలాండ్ పిచ్పై ఐసీసీ చర్యలకు సిద్ధమైంది.
ఈ గ్రౌండ్పై డీమెరిట్ పాయింట్లు విధించనుందనే వార్తలు వినిపిస్తున్నాయి. అయితే.. పిచ్లకు రేటింగ్ ఇచ్చే విషయంలో ఐసీసీ ద్వంద్వ వైఖరిని తప్పుపట్టిన భారత కెప్టెన్ రోహిత్ శర్మపై ఎలాంటి చర్యలు ఉంటాయనేది ఇంకా వెల్లడించలేదు.
సెంచూరియన్ టెస్టులో చావుదెబ్బతిన్న భారత్ కేప్టౌన్ టెస్టును సవాల్గా తీసుకుంది. అయితే.. టాస్ గెలిచి బ్యాటింగ్ తీసుకున్న సఫారీ సారథి డీన్ ఎల్గర్కు తాను ఎంత పెద్ద పొరపాటు చేశాడో కాసేపట్లోనే అర్థమైంది. సిరాజ్ విరుచుకుపడడంతో ప్రొటీస్ జట్టు 55 పరుగులకే ఆలౌటయ్యింది. అనంతరం రబడ, బర్గర్ ధాటికి భారత బ్యాటర్లు కూడా పెవిలియన్కు క్యూ కట్టారు. తొలి రోజే ఈ పిచ్పై ఏకంగా 23 వికెట్లు పడడం క్రికెట్ దిగ్గజాలను ఆశ్చర్యానికి



గురి చేసింది. ఇలాంటి ఫ్లాట్, బౌన్సీ పిచ్లు సుదీర్ఘ ఫార్మాట్కు చేటు చేస్తాయని మిస్టర్ 360 ఏబీ డివిలియర్స్, సఫారీ మాజీ పేసర్ డేల్ స్టెయిన్ సైతం అభిప్రాయపడిన విషయం తెలిసిందే. సిరీస్ డిసైడర్ అయిన కేప్టౌన్లో భారత్ ఘన విజయం సాధించింది. పేస్ ద్వయం బుమ్రా 8, సిరాజ్ 7 వికెట్లతో సఫారీల భరతం పట్టారు. దాంతో, టీమిండియా 7 వికెట్ల తేడాతో చారిత్రాత్మక విజయం నమోదు చేయడమే కాకుండా సిరీస్ సమం చేసింది.

# స్టార్ ఓపెనర్కు మళ్లీ నిరాశే.. వైస్ కెప్టెన్సీతో సరిపుచ్చిన పాక్ బోర్డు

కెప్టెన్సీపై గంపెడు ఆశలు పెట్టుకున్న పాకిస్థాన్ స్టార్ ఓపెనర్ మహ్మద్ రిజ్వాన్ )కు మరోసారి నిరాశే మిగిలింది.
వన్డే వరల్డ్ కప్ అనంతరం బాబర్ ఆజాం కెప్టెన్గా తప్పుకున్నాక .. ఈ స్టార్ బ్యాటర్ను సారథిగా ప్రకటిస్తారని అందరూ ఊహించారు.
కానీ, సెలెక్టర్లు షాన్ మసూద్ కు వన్డే, పేసర్ షాహీన్ అఫ్రిది కి టీ20 పగ్గాలు అప్పగించారు. దాంతో, రిజ్వాన్కు కెప్టెన్సీ ఇస్తే బాగుండేదని మాజీ క్రికెటర్లు అభిప్రాయపడ్డారు.
ఈ నేపథ్యంలో దిద్దుబాటు చర్యలు చేపట్టిన పాక్ బోర్డు అతడిని వైస్ కెప్టెన్గా నియమించింది. న్యూజిలాండ్ పర్యటనలో ఐదు టీ20ల సిరీస్కు జట్టును ప్రకటించిన బోర్డు.. రిజ్వాన్కు వైస్ కెప్టెన్సీ అప్పగించింది. ఆ సిరీస్లో షాహీన్ అఫ్రిదికి రిజ్వాన్ డిప్యూటీగా వ్యవహరించనున్నాడు. పొట్టి ప్రపంచ కప్ ఉన్నందున పాక్ జట్టును మరింత పటిష్టం చేసే బాధ్యత ఈ ఇద్దరికి అప్పగించారు.
పాకిస్థాన్ స్క్వాడ్ : షాహీన్ షా అఫ్రిది(కెప్టెన్), అమర్ జమాల్, అబ్బాస్ అఫ్రిది, అజమ్ ఖాన్(వికెట్ కీపర్), బాబర్ ఆజాం, ఫఖర్ జమాన్, హ్యారిస్ రౌఫ్, హసీబుల్లా(వికెట్ కీపర్), ఇఫ్తికార్ అహ్మద్, మహ్మద్ నవాజ్, రిజ్వాన్(వైస్ కెప్టెన్), మహ్మద్ వసీం జూనియర్, సహిబ్జద ఫర్హాన్, సయీం అయూబ్, ఉసామ మిర్, జమాన్ ఖాన్.



కివీస్ గడ్డపై పాక్ ఐదు టీ20లు ఆడనుంది. ఇరుజట్ల మధ్య జనవరి 12న ఆక్లాండ్లోని ఈడెన్ పార్క్లో తొలి మ్యాచ్ జరుగనుంది. జనవరి 14న హమిల్టన్లో రెండో టీ20, 17వ తేదీన డెనెడిల్లో మూడో మ్యాచ్ , 19న క్రిస్ట్చర్చ్లో నాలుగో మ్యాచ్, 21న క్రిస్ట్చర్చ్లోనే ఐదో టీ20 నిర్వహించనున్నారు.
ప్రపంచంలోని విధ్వంసక బ్యాటర్లలో ఒకడైన రిజ్వాన్ పాక్ తరఫున 85 టీ20లు ఆడాడు. ఒక సెంచరీ, 25 హాఫ్ సెంచరీలతో కలిపి 2,797 పరుగులు సాధించాడు. నిరుడు ఆస్ట్రేలియా గడ్డపై జరిగిన టీ20 వరల్డ్ కప్లో రిజ్వాన్ అద్భుతంగా రాణించాడు. ఈసారి వెస్టిండీస్, అమెరికా ఆతిథ్యమిస్తున్న మెగా టోర్నీలో మరోసారి సత్తా చాటేందుకు ఈ లెఫ్ట్హ్యాండర్ ఆతృతగా ఎదురుచుస్తున్నాడు.

# ఎంపీగా గెలుపొందిన బంగ్లాదేశ్ కెప్టెన్

బంగ్లాదేశ్ కెప్టెన్ షకీబుల్ హసన్ ఎంపీగా కొత్త అవతారం ఎత్తనున్నాడు. ఇన్నాళ్లు మైదానంలో ఆల్రౌండ్ షోతో అదరగొట్టిన షకీబ్ ప్రజాజీవితంలో భాగం కానున్నాడు. వన్డే వరల్డ్ కప్ అనంతరం రాజకీయాల్లో అడుగుపెట్టిన అతడు.. తొలిసారే సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించాడు. ఆదివారం జరిగిన ఎన్నికల్లో మగుర 1 నియోజకవర్గం నుంచి పోటీ చేసిన షకీబ్ భారీ మెజార్టీతో గెలుపొందాడు. ప్రధాని షేక్ హసీనాకు చెందిన అవామీ లీగ్ తరఫున పోటీ చేసిన ఈ ఆల్రౌండర్ ఏకంగా లక్షా యాభై వేల మెజార్టీతో సమీప ప్రత్యర్థి రెజౌల్ హసన్ను చిత్తు చేశాడు. షకీబ్కు 1,85,388 ఓట్లు రాగా.. బంగ్లాదేశ్ కాంగ్రెస్ పార్టీకి చెందిన హసన్కు కేవలం 45,933 ఓట్లు మాత్రమే పడ్డాయి. దాంతో, ఎన్నికల్లో గెలిచిన బంగ్లాదేశ్ రెండో కెప్టెన్గా ఎంపీగా షకీబ్ రికార్డు సృష్టించాడు. ఇంతకు ముందు ముష్రఫే ముర్తాజాఎంపీగా ఎన్నికైన విషయం తెలిసిందే. షకీబ్ ఎన్నికల్లో బరిలోకి దిగుతున్నానని ప్రకటించగానే అతడి క్రికెట్ కెరీర్ ముగిసిందని కొందరు ప్రచారం మొదలెట్టారు. దాంతో, వాళ్లకు చెక్ పెట్టేందుకు అతడు ప్రచార సభల్లో జనాన్ని అడిగాడు. 'నేను రిటైర్ అవ్వాలా? 'అని ఎన్నికల ప్రచారంలో ఓటర్లను అడిగిన షకీబ్.. 'నేను ఇంకా క్రికెట్కు వీడ్కోలు పలకలేదు. అలాంటప్పుడు ఈ వదంతులు ఎందుకు సృష్టిస్తున్నారు' అంటూ ప్రత్యర్థులపై విరుచుకుపడ్డాడు. 19 ఏండ్లకే ప్రీమియర్ స్పోర్ట్స్ అకాడమీలో చేరిన షకీబ్ 2006లో బ్యాటింగ్ ఆల్రౌండర్గా అరంగేట్రం చేశాడు. అనతికాలంలోనే ప్రపంచంలోని ఉత్తమ ఆల్రౌండర్లలో ఒకడిగా ఎదిగాడు.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI NO:- TELTEL 02048/2021, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**